Follow: @ANNTELUGU
21-03-2026
ANN తెలుగు
# మహా పత్రిక
శనివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 83 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




## కనిపించిన నెలవంక..
# నేడే రంజాన్
### శుభాకాంక్షలు తెలిపిన సీఎంలు రేవంత్ రెడ్డి, చంద్రబాబు

**హైదరాబాద్, మహా :** ముస్లింల పవిత్ర పండుగ రంజాన్(ఈద్‌ఉల్‌ఫితర్)కు వేళైంది. భారత్‌లో శుక్రవారం సాయంత్రం నెలవంక కనిపించింది. దీంతో దేశవ్యాప్తంగా శనివారం(మార్చి 21న) రంజాన్ పండుగను నిర్వహించుకునేందుకు ముస్లిం సోదరులు సన్నద్ధమవుతున్నారు. పవిత్ర దివ్య ఖురాన్ అవతరించిన ఈ మాసంలో కఠిన ఉపవాస దీక్షల అనంతరం ఈ వేడుకను జరుపుకోనున్నారు ముస్లిం సోదరులు. మనిషిలోని చెడు భావనల్ని, అధర్మాన్ని, ద్వేషాన్ని రూపుమాపే గొప్ప పండుగ 'ఈద్‌ఉల్‌ఫితర్' అని ముస్లింలు భావిస్తారు. కాగా పవిత్ర రంజాన్(ఈద్‌ఉల్‌ఫితర్) పండుగ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం సోదర సోదరీమణులు తమ కుటుంబ సభ్యులు,


మిగతా 2లో

**టాప్ న్యూస్**




### అన్నివర్గాలకు మేలుచేసేలా బడ్జెట్
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్
- డ్రగ్స్ కార్యకలాపాల్లో కేటీఆర్ టీమ్

02



### భట్టి బడ్జెట్ బోగస్ బడ్జెట్
- హరీశ్‌రావు విమర్శలు

02



### భట్టి బడ్జెట్ అంకెల గారడీ
- ఒక ఫెయిల్డ్, ఫాల్స్, ఫ్యాన్సీ బడ్జెట్
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు ఫైర్

02

# రూ.3,24,234 కోట్లతో తెలంగాణ బడ్జెట్

**శాసనసభలో భట్టి కౌన్సిల్‌లో ఉత్తమ్.. ఆరోగ్యం.. ఆరు గ్యారంటీలకు పెద్దపీట**
**బడ్జెట్‌లో కొత్త పథకాలు.. అందరికీ జీవిత భీమా ధీమా**

> బడ్జెట్ అంటే సంఖ్యల చుట్టూ తిరిగే అంకెలు కాదు. ప్రజల చుట్టు తిరిగే సంఖ్యలు. బడ్జెట్ ప్రజల జీవనస్థితిగతుల మార్పు కు దోహదపడే లెక్కలు. తెలంగాణ ప్రజల ఆశలు ఆశయాలు నిజం చేసే సంకల్ప పత్రమే ఈ బడ్జెట్. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి అద్దం పట్టేలా దీన్ని రూపొందించాము . గొప్పల కోసం మేము అబద్ధాలు చెప్పం ఈ ప్రభుత్వం వాస్తవాల పునాదుల మీద పనిచేస్తున్నది.
>
> - బడ్జెట్ ప్రసంగంలో భట్టి విక్రమార్క

**హైదరాబాద్, మహా:** తెలంగాణ ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. శాసనసభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రవేశపెట్టి ప్రసంగాన్ని ప్రారంభించారు. రూ.3,24,234 కోట్లతో రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక న్యాయం అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అంబేడ్కర్ అడుగు జాడల్లోనే పాలన సాగిస్తున్నట్లు తెలిపారు. రెండుగంటల పాటు భట్టి బడ్జెట్ ప్రసంగం సాగింది. అటు శాసనమండలిలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఉత్తమ్ బడ్జెట్ ప్రసంగం పూర్తిగా ఇంగ్లీష్ లో సాగింది. బడ్జెట్ లో కొత్త పథకాలు కూడా ప్రవేశపెట్టారు. అందరికీ జీవితభీమా హామీనిచ్చారు.



### బడ్జెట్ స్వరూపం

| | |
|---|---|
| మొత్తం బడ్జెట్.. | రూ.3,24,234 కోట్లు |
| రెవెన్యూ వ్యయం.. | రూ.2,34,406 కోట్లు |
| మూలధన వ్యయం.. | రూ.47,267 కోట్లు |

### బడ్జెట్ కేటాయింపులు (శాఖల వారీగా)

| | |
|---|---|
| వ్యవసాయానికి | 23,179 కోట్లు |
| సివిల్ సప్లై శాఖకు | 7,366 కోట్లు |
| పశు సంవర్థక శాఖకి | 1529 కోట్ల |
| విద్యుత్ శాఖకు | 21,285 కోట్లు |
| విద్యా శాఖకి | 26, 674 కోట్లు |
| వైద్య ఆరోగ్య శాఖకు | 13,679 కోట్లు |
| కార్మిక శాఖకు | 998 కోట్లు |
| మహిళా శిశు సంక్షేమ శాఖకి | 3,143 కోట్లు |
| షెడ్యూల్ కులాలకు | 11,784 కోట్లు |
| షెడ్యూల్ తెగలకు | 7,937 కోట్లు |
| వెనక బడిన తరగతులకు | 12511 కోట్లు |
| మైనార్టీ సంక్షేమానికి | 3,769 కోట్లు |
| రాజీవ్ యువ వికాసంకు | 6 వేల కోట్లు |
| గృహ నిర్మాణానికి | 7,430 కోట్లు |
| ఐటీ శాఖకు | 875 కోట్లు |
| పరిశ్రమల శాఖకి | 3,490 కోట్లు |
| చేనేత శాఖకు | 258 కోట్లు |
| పంచాయతీ రాజ్ శాఖకు | 33,688 కోట్లు |
| ఇరిగేషన్ కు | 22,615 కోట్లు |
| రవాణా రోడ్డు భవనాల శాఖకి | 12,789 కోట్లు |
| న్యాయ శాఖకు | 2367 కోట్లు |
| పురపాలక పట్టణాభివృద్ధి శాఖకు | 17,907 కోట్లు |
| హోం శాఖకు | 11,907 కోట్లు |
| గోదావరి పుష్కరాలకు | 500 కోట్లు |
| పర్యాటక శాఖకు | 1224 కోట్లు |



# మూసీపై ముందుకే నష్టపోయేవారిని ఎలా ఆదుకోవాలో చర్చిస్తున్నాం

- మంత్రివర్గ విస్తరణపై ఊహాగానాలొద్దు
- విద్యారంగంలో సమూలమార్పులు.. నర్సరీ నుండి 12వరకు ఒకే విధానం
- బీఆర్ఎస్ హయాంలో ఆరువేల ఫోన్లు ట్యాప్
- తెలంగాణ బడ్జెట్.. రైజింగ్ లక్ష్యానికి పెద్దపీఠ
- మీడియాతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిట్ చాట్

**హైదరాబాద్, మహా:** కేబినెట్ విస్తరణపై ప్రస్తావన వచ్చినప్పుడల్లా వివరణ ఇవ్వాల్సిన అవసరం లేదని, మంత్రివర్గ విస్తరణపై ఊహాగానాలు చేయవద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం బడ్జెట్ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేబినెట్ విస్తరణ ఎప్పుడు చేయాలో తనకు తెలుసని.. డిప్యూటీ స్పీకర్ ఎన్నిక అవసరం ఉన్నప్పుడు చేస్తానని వెల్లడించారు. తెలంగాణ బడ్జెట్ ఫ్యూచరిస్టిక్ బడ్జెట్ అని, అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యమిచ్చారన్నారు. రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్ ఆర్థిక వృద్ధి ని దృష్టి లో పెట్టుకొని మౌలిక వసతుల కల్పనకు సరిపడే నిధుల కేటాయింపు

మిగతా 2లో

### జగన్ ఇప్పటికైనా చెల్లెలుకు న్యాయం చేయాలని కోరుకుంటున్నా...
వైఎస్ విజయమ్మ అడ్వకేట్ నోటరీ
నిజం ఏమిటో దేవుడికి, నా కొడుక్కి తెలుసు

02



## కనిపించిన నెలవంక..
# నేడే రంజాన్

(మొదటిపేజీ తరువాయి)

బంధుమిత్రులందరితో సంతోషంగా రంజాన్ వేడుకలు నిర్వహించుకోవాలని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి అన్నారు. ఉపవాస దీక్షలు, ప్రార్థనలతో ఆధ్యాత్మిక చింతన పెంచుకునే ఈ పండుగ.. సోదరభావాన్ని పెంపొందించాలని ఆకాంక్షించారు. ముస్లింల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, లౌకికవాదానికి పెద్దపీట వేస్తామని ఆయన పేర్కొన్నారు.

**రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన సీఎం చంద్రబాబు**

ముస్లింలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా వారు ట్వీట్ పెట్టారు. ఇస్లాం మతంలో అత్యంత పవిత్రమైన ఈ రంజాన్ నెలలో ఉపవాసదీక్షలు, ప్రార్థనలు మనసును పవిత్రం చేసుకోవడానికి, మంచి మార్గంలో నడవడానికి, పరస్పర ప్రేమాభిమానాలను పెంపొందించడానికి ఒక మంచి అవకాశమని సీఎం చంద్రబాబు తెలిపారు.

# భట్టి బడ్జెట్ అంకెల గారడీ

## ఒక ఫెయిల్డ్, ఫాల్స్, ఫ్యాన్సీ బడ్జెట్.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు ఫైర్



**హైదరాబాద్, మహా :** అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అత్యంత నిరాశాజనకంగా ఉందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు విమర్శించారు. ఆర్థిక మంత్రి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బహుశా పొరపాటున గత ఏడాది బడ్జెట్ నే చదివారేమో అన్న అనుమానం కలుగుతోందని, ఎందుకంటే పోయినసారి బడ్జెట్ కన్నా ఇందులో పెద్దగా మార్పులు చేర్పులు ఏమీ లేవని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు దాటినా, ప్రభుత్వం ప్రజలకు ఏం చేసిందో, ఎక్కడ అభివృద్ధి జరిగిందో చెప్పుకోవడానికి ఒక్క రిజల్ట్ కూడా లేకపోవడం బాధాకరమన్నారు. ముఖ్యంగా విద్యా రంగానికి ఈ బడ్జెట్ లో తీరని అన్యాయం జరిగిందని రాంచందర్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా రంగానికి గత ఏడాది కంటే రూ. 1000 కోట్లు పెంచినట్లు చూపిస్తున్నా, ఓవరాల్ బడ్జెట్ లో దీని వాటా కేవలం 8 శాతం మాత్రమేనని గుర్తు చేశారు. పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్ (13%), బీహార్ (21%) తమ బడ్జెట్ లో విద్యకు ఇస్తున్న ప్రాధాన్యతలో సగం కూడా తెలంగాణ ప్రభుత్వం ఇవ్వడం లేదన్నారు. 'ఇంటిగ్రేటెడ్ యూనివర్సిటీలు' అని గొప్పలు చెప్పడం తప్ప, విద్యా వ్యవస్థను మెరుగుపరిచే ఒక్క ప్రయత్నం కూడా కనిపించడం లేదన్నారు.

ఆరోగ్య రంగం విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం అట్టడుగున ఉందన్నారు. ఆరోగ్యశ్రీ బకాయిలే ఇంకా చెల్లించలేని రేవంత్ ప్రభుత్వం, పెన్షన్లు, ఇతర బెనిఫిట్లను కూడా ఆరోగ్యశ్రీ డిపార్ట్ మెంట్ కే అప్పగించడం అంటే ఆ సంస్థను కూడా దివాళా తీయించడమేనని హెచ్చరించారు. అభివృద్ధి ఎక్కడ జరుగుతుందో చెప్పకుండా 'ఫ్యూచర్ సిటీ' అని ఫ్యాన్సీ పేర్లతో ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన ఘనతగా చెప్పుకుంటున్న ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ లన్నీ కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇచ్చే పథకాలతో పాటు, 'మేక్ ఇన్ ఇండియా', 'స్టార్టప్ ఇండియా' పథకాల వల్ల వచ్చినవేనని స్పష్టం చేశారు. రీజనల్ రింగ్ రోడ్, దాని పక్కన వచ్చే రీజనల్ రింగ్ రైల్ కూడా పూర్తిగా కేంద్ర ప్రభుత్వ ఫండింగ్ అని, కేవలం భూసేకరణ తప్ప రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్నదేమీ లేదని ఎండగట్టారు. రైతుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పచ్చి అబద్ధాలు ఆడుతోందని రాంచందర్ రావు మండిపడ్డారు. ఐదు దఫాలుగా రైతు భరోసా ఇవ్వాల్సి ఉండగా, సరిగ్గా ఇవ్వకుండా.. ఇంకా ప్రతి రైతుకు ఇంకా సుమారు ఎకరాకు రూ. 45,000 కి పైగా బాకీ పడి ఎగ్గొట్టారని విమర్శించారు. నిరుద్యోగులకు ఇస్తామన్న రూ. 4000 నిరుద్యోగ భృతి కానీ, మహిళలకు ఇస్తామన్న రూ. 2500 ఆర్థిక సాయం గురించి కానీ ఈ బడ్జెట్ లో ఎక్కడా కనిపించడం లేదన్నారు. ఆరు గ్యారంటీల అమలుకు సంబంధించి ఈ బడ్జెట్ లో చోటు లేకపోవడం ప్రజలను వంచించడమేనన్నారు.

కాంగ్రెస్ సర్కారు మూసీ ప్రక్షాళన పేరుతో పేదల ఇళ్లను కూలగొట్టడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమర్జెన్సీ కాలంలో సంజయ్ గాంధీ ఢిల్లీలో తుర్కమాన్ గేట్ వద్ద పేదల ఇళ్లు కూలగొట్టిన 'మైండ్ సెట్' తోనే నేటి కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని దుయ్యబట్టారు. మూసీ ప్రాజెక్ట్ వ్యయం రెండు రోజుల్లోనే రూ. 5000 కోట్ల నుండి రూ. 7000 కోట్లకు ఎలా పెరిగిందని రాంచందర్ రావు నిలదీశారు. ఇదంతా ఒక ప్లానింగ్ లేని విధానమని, కేవలం దోచుకోవడానికేనని ఆరోపించారు. దేవాలయాల విషయంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని రాంచందర్ రావు విమర్శించారు. అర్చకుల వేతనాలు పెంచాలని, ధూప దీప నైవేద్యాలకు బడ్జెట్ పెంచాలన్న డిమాండ్లను పట్టించుకోకుండా, కేవలం మైనారిటీ బడ్జెట్ను రూ. 700 కోట్లు పెంచడం ఓటు బ్యాంక్ పాలిటిక్స్ లో భాగమేనన్నారు. హైదరాబాద్ నగరాన్ని మూడు ముక్కలు చేసి జీహెచ్ఎంసికి బడ్జెట్ కేటాయించకుండా అభివృద్ధి ఎలా సాధ్యమని ఆయన ప్రశ్నించారు. ఓవరాల్‌గా ఈ బడ్జెట్ ప్రజల ఆశలపై నీళ్లు చల్లిందని, పేదలకు దూరంగా ఉన్న ఈ 'ఫెయిల్డ్ బడ్జెట్' ను బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని రాంచందర్ రావు స్పష్టం చేశారు.

## జగన్ ఇప్పటికైనా చెల్లెలుకు
# న్యాయం చేయాలని కోరుకుంటున్నా...

### వైఎస్ విజయమ్మ అడ్వకేట్ నోటరీ

### నిజం ఏమిటో దేవుడికి, నా కొడుక్కి తెలుసు

**కడప, మహా :** కుటుంబ ఆస్తుల పంపకాలపై నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ లో వివాదం కొనసాగుతున్న వేళ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ సతీమణి విజయమ్మ మీడియాకు అడ్వకేట్ నోటరీ విడుదల చేశారు. వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలపై అందులో పూర్తిస్థాయి స్పష్టత ఇచ్చారు. ఆస్తుల విషయంలో చెల్లెలు, ఆమె పిల్లలకు జగన్ అన్యాయం చేశారని అన్నారు. ఆస్తుల పంపకం ఎప్పుడూ జరగలేదని, వైఎస్ మరణించే వరకు ఉన్న ఆస్తులన్నీ కుటుంబ ఆస్తులేనని ఆమె అన్నారు. " తన ఆస్తులన్నీ నలుగురు మనవలు, మనవరాళ్లకు సమానంగా పంచాలని వైఎస్ఆర్ ఉద్దేశం. ఇది ఆయన ఆదేశం కూడా. దగ్గర వాళ్లందరికీ తెలిసిన వాస్తవమిది. ఎంవోయూలో షర్మిలకు రాసిన ప్రతి ఆస్తి న్యాయంగా ఆమెకు దక్కాల్సిందే. షర్మిల హక్కుకు అనుగుణంగానే జగన్ ఎంవోయూ రాశాడు. వాస్తవానికి షర్మిలకు చెందాల్సిన దానికంటే తక్కువే రాశాడు. సరస్వతి సిమెంట్ సహా యెలహంక భూమి కూడా షర్మిలదే. షర్మిలకు ఇప్పటి వరకు ఇచ్చానని చెబుతున్న డబ్బంతా డివిడెండ్ మాత్రమే. ఆస్తుల విషయంలో జగన్ తన మేనల్లుడు, మేనకోడలికి ఇప్పటివరకు అన్యాయం చేశాడు. ఇప్పటికైనా న్యాయం చేస్తాడని తల్లిగా ఆశిస్తున్నాను. నిజం ఏమిటో దేవుడికి, నా కొడుక్కి కూడా తెలుసు. దేవుడి సాక్షిగా నేను రాసినవన్నీ వాస్తవాలు మాత్రమే" అని ఆమె పేర్కొన్నారు.

# అన్నివర్గాలకు మేలుచేసేలా బడ్జెట్

## టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్.. డ్రగ్స్ కార్యకలాపాల్లో కేటీఆర్ టీమ్

**హైదరాబాద్, మహా:** ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్నివర్గాలకు మేలుచేసేలా ఉందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. నూతనంగా విప్ లుగా నియమితులైన వారికి అభినందనలు తెలిపారు. ఈగల్ టీమ్ చేసిన దాడిలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఒక ఎంపీ రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డారని, డ్రగ్స్ మీద తమ ప్రభుత్వం ఉక్కు పాదం మోపుతోందన్నారు. యువనాయకుడి బ్యాచ్ మొత్తం డ్రగ్స్ కార్యక్రమాల్లో దొరుకుతున్నారని, కెటిఆర్ ఫాం హౌజ్ లో డ్రగ్స్ తో వాళ్ళ బామ్మర్ది పట్టుబడ్డారని, కేటిఆర్ సన్నిహితుడు డ్రగ్స్ ఎక్కువ తీసుకుని కేదార్ దుబాయ్ లో చనిపోయాడన్నారు. పోచం పల్లి ఫాం హౌజ్ లో కోళ్ల పందాలు జరిగాయని, ఇవన్నీ జరుగుతుంటే బీజేపీ నాయకులు ఎందుకు స్పందించడం లేదన్నారు. బీఆర్ఎస్ నేతలు ఇంత మంది దొరుకుతుంటే బీజేపీ ఎందుకు మాట్లాడడం లేదు..బీజేపీ రఘు నందన్ మాట్లాడితే ఆయన నోరు ఎందుకు మూయించారన్నారు. బీజేపీ బీఆర్ఎస్ ఎన్నికల్లోనే కాదు.. బయట కూడా కలిసి పని చేస్తున్నారని, బీజేపీ లో బీఆర్ఎస్ విలీనం అవుతుందని, అందుకే మాట్లాడడం లేదన్నారు. బీఆర్ఎస్ హయంలో బీజేపీ అగ్ర నాయకులను అరెస్ట్ చేసింది మరిచిపోయారా.. అని ప్రశ్నించారు. బీజేపీ నాయకులు బిసి ల గురించి మాట్లాడితే విడ్డూరంగా ఉందని, బండారు దత్తాత్రేయ బీజేపీకి ఎన్నో సేవలు అందించారని, ఆయన సికింద్రాబాద్ సీటు ను కిషన్ రెడ్డి లాక్కున్నారన్నారు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సీటు ను మొన్న బండి సంజయ్ ను దించి కిషన్ రెడ్డి లాక్కున్నారని, బండారు దత్తాత్రేయ కు ఉన్న ఒక్క గవర్నర్ పదవి నీ కూడా మరొక అగ్రకుల నాయకుడు లాక్కున్నాడన్నారు. బిసి ల గురించి బీజేపీ నేతలు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. తాము బిసి లకు ఇచ్చిన హామీలు ఒక్కొక్కటి అమలు చేస్తున్నామని, డ్రగ్స్ విషయం లో బీజేపీ నేతల వైఖరి జనాలకు చెప్పాలని, వారం రోజులు గడుస్తున్న ఎందుకు డ్రగ్స్ మీద మాట్లాడడం లేదన్నారు.

# భట్టి బడ్జెట్ బోగస్ బడ్జెట్

## హరీశ్‌రావు విమర్శలు

**హైదరాబాద్, మహా :** 'భట్టి బడ్జెట్.. బడా జూటా బడ్జెట్, బోగస్ బడ్జెట్' అని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. బడ్జెట్‌లో సకల జనులకు దక్కింది సున్నా మాత్రమేనని.. అంకెలు, మాటల గారడీ తప్ప ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ధ్వజమెత్తారు. తెలంగాణను, హైదరాబాద్‌ను మూడు ముక్కలు చేయడం తప్ప.. భట్టి ప్రవేశ పెట్టిన పద్దులో ఏమీ లేదని దుయ్యబట్టారు. తమ హయాంలో అప్పులు చేసి.. ఆస్తులు సృష్టించామని, కాంగ్రెస్ రూ.3.5లక్షల కోట్ల అప్పుతో ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. కర్షకులకు రైతు భరోసా ఎగ్గొట్టినందుకు క్షమాపణ చెబుతారని భావిస్తే.. ఇష్టారీతిన అబద్ధాలు చెప్పారని మండిపడ్డారు. పెట్టుబడుల విషయంలోనూ కట్టుకథలే చెప్పారని, అక్రమ సంపాదన దాచుకునేందుకు విదేశీ పర్యటనలు చేస్తున్నారని ఆరోపించారు.

## మూసీపై ముందుకే నష్టపోయేవారిని ఎలా ఆదుకోవాలో
# చర్చిస్తున్నాం

(మొదటిపేజీ తరువాయి)

జరిగిందని, తెలంగాణ రైజింగ్ విజన్ లక్ష్యానికి బడ్జెట్ పెద్ద పీట వేసిందన్నారు. మూసీ ప్రాజెక్టు విషయంలో వెనక్కు వచ్చేది లేదని, నష్టపోయిన వారిని ఎలా ఆదుకోవాలో ప్రజల నుండి అభిప్రాయాలను సేకరిస్తున్నట్టు సీఎం తెలిపారు. నదికి రెండు వైపులా 50 మీటర్ల చొప్పున మాత్రమే భూ సేకరణ చేస్తామని.. అందుకు తగ్గ ప్లాన్ కూడీ రెడీ అయినట్టు చెప్పారు. ఈ ప్రాజెక్టుపై గాంధీ మనవడు తుషార్ గాంధీ చేసిన వ్యాఖ్యలు తాను తెలుసుకున్నానని సీఎం పేర్కొన్నారు. గాంధీ మనవడు కూడా ఈ దేశ పౌరుడే అని.. ఆయన బీఆర్ఎస్ ట్రాప్ లో పడి ఆ ప్రకటన చేసి ఉంటారని సీఎం రేవంత్ చెప్పారు. డ్రగ్స్ అంశంలో ఇంత జరుగుతుంటే బీజేపీ ఎందుకు స్పందించట్లేదని సీఎం రేవంత్ ప్రశ్నించారు. బీఆర్ఎస్ వాళ్లను తిడుతుంటే బీజేపీ రియాక్ట్ అవుతోందని.. వచ్చే ఎన్నికల్లో ఆ రెండు పార్టీలు కలిసి పోటీ చేస్తాయో లేదా త్వరలోనే చెప్తానని సీఎం రేవంత్ చెప్పుకొచ్చారు. బీఆర్ ఎస్ హయాంలో 6వేల ఫోన్లు ట్యాపింగ్ చేశారని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ వల్ల ఎంతో మంది జీవితాలు బలైపోయాయని సీఎం రేవంత్ వెల్లడించారు.

# మరో శ్రీలంకలా మారుస్తారా?

- తెలంగాణ బడ్జెట్‌పై బండి సంజయ్ నిప్పులు
- అంకెల గారడీతో ప్రజలను వంచిస్తున్నారు
- రైతు భరోసా ఒక మోసం.. ఆరు గ్యారంటీల మాటేమిటి?
- కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రశ్నల వర్షం
- బడ్జెట్ వైఫల్యాలపై బండి సంజయ్ ఫైర్



**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్ పై భారతీయ జనతా పార్టీ అగ్రనేత, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కరీంనగర్ వేదికగా ఆయన రాష్ట్ర ప్రభుత్వ తీరును ఎండగడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాలు చూస్తుంటే, తెలంగాణ రాష్ట్రం భవిష్యత్తులో మరో శ్రీలంకలా మారబోతోందా అనే భయం కలుగుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం అంకెల గారడీతో, ఆర్భాటపు ప్రకటనలతో ప్రజలను మోసం చేయడమే తప్ప, ఈ బడ్జెట్‌లో సామాన్యుడికి ఒరిగేదేమీ లేదని ఆయన కొట్టిపారేశారు.

ముఖ్యంగా రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రైతు సంక్షేమంపై ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని బండి సంజయ్ తీవ్రంగా తప్పుబట్టారు. కాంగ్రెస్ పార్టీ పాలన ప్రజల చేతికి చిప్ప ఇచ్చేలా ఉందని, ఇది తెలంగాణ ఆత్మగౌరవానికి దెబ్బ అని ఆయన విమర్శించారు. మనది బిచ్చపు బతుకులేనా? అంటూ భావోద్వేగపూరిత ప్రశ్నను సంధించిన ఆయన, ఇప్పుడు తెలంగాణ సమాజం మేల్కొనాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. ఈ బడ్జెట్ కేటాయింపులన్నీ ప్రగల్భాలకే పరిమితమని, ఆచరణలో శూన్యమని ఆయన ఎద్దేవా చేశారు.

రైతు భరోసా పథకం విషయంలో ముఖ్యమంత్రి రైతులను అమాయకులను చేస్తున్నారని బండి సంజయ్ ఆరోపించారు. కేవలం పద్దెనిమిది వేల కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించి, రైతులకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ఆరు వాయిదాల్లో ఇవ్వాల్సిన నిధులను కేవలం నాలుగు వాయిదాలకే పరిమితం చేసి, మిగిలిన రెండు వాయిదాలను ఎగ్గొట్టేందుకు ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసిందని ఆయన విమర్శించారు. ఒకసారి నిధులు ఇచ్చి, పాతది ఇవ్వక, వచ్చేది ఇవ్వక రైతులను అయోమయానికి గురిచేస్తూ, చివరకు "దుకాణం బంద్" అనే రీతిలో ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. రైతు కూలీలకు ఏటా 12 వేల రూపాయలు ఇస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ఆయన నిలదీశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన 8 లక్షల కోట్ల అప్పుల గురించి పదే పదే మాట్లాడుతున్న ముఖ్యమంత్రి, తాను అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్ళీ లక్ష కోట్ల రూపాయల అప్పు చేసేందుకు సిద్ధమవ్వడం హాస్యాస్పదమని బండి సంజయ్ పేర్కొన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను నమ్మించి, ఇప్పుడు వాటిని గాలికొదిలేశారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో ప్రజలకు ఏమీ అందలేదని అసెంబ్లీ సాక్షిగా గొప్పలు చెప్పిన ముఖ్యమంత్రి, ఇప్పుడు తానూ అదే బాటలో నడుస్తూ ప్రజలకు గడ్డి గుడ్డు చూపించారని ఆయన ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ తెలంగాణ ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తామని బండి సంజయ్ స్పష్టం చేశారు.

## భద్రాచలం దేవస్థానం అభివృద్ధికి
# మాస్టర్ ప్లాన్

### మూడు దశల్లో అభివృద్ధి పనులు

మాస్టర్ ప్లాన్‌పై చర్చించిన మంత్రులు పొంగులేటి, సురేఖ, తుమ్మల, వాకిటి

**హైదరాబాద్:** దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థాన అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, వాకాటి శ్రీహరి అన్నారు. భద్రాద్రిని ఒక అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉందని వెల్లడించారు. భద్రాచలం ఆలయ రూపురేఖలను మార్చేలా రూపొందించిన మాస్టర్ ప్లాన్ పై శుక్రవారం సచివాలయంలోని మంత్రి కొండా సురేఖ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ రెండు వందల సంవత్సరాలను దృష్టిలో పెట్టుకొని ఆగమ శాస్త్రం ప్రకారం భక్తుల మనోభావాలకు అనుగుణంగా మూడు దశల్లో ఆలయాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించిన తర్వాత మాస్టర్ ప్లాన్‌కు తుదిరూపునివ్వాలని సమావేశంలో నిర్ణయించారు. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాలు ప్రారంభమయ్యేనాటికి భద్రాచలంలో పుష్కర ఘాట్ తో పాటు మొదటి దశ ఆలయ అభివృద్ధి పనులు పూర్తయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. భద్రాచలాన్ని తెలంగాణలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక హబ్‌గా మారుస్తామన్నారు. భద్రాచలం సమీపంలోని రామవరంలో ట్రైబల్ మ్యూజియం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గోదావరి పుష్కరాలలో భాగంగా అత్యంత ప్రాధాన్యత కలిగిన కొరివి వీరభద్రస్వామి దేవాలయం, మల్లూరులోని నరసింహాస్వామి దేవాలయాలను కూడా అభివృద్ధి చేయాలని సూచించారు. సమావేశంలో పార్లమెంట్ సభ్యులు బలరాం నాయిక్ , శాసనసభ్యులు తెల్లం వెంకటరావు పాల్గొన్నారు.

# రూ.3,24,234 కోట్లతో తెలంగాణ బడ్జెట్

(మొదటిపేజీ తరువాయి)

- 1.15 కోట్ల కుటుంబాలకు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం
- జూన్ 2 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు
- ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు అల్పాహారం
- ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రహిత ఆరోగ్య భద్రత పథకం.
- ఐటీఐ, ఏటీసీల్లో చదివే విద్యార్థులకు నెలకు రూ.2 వేల ఉపకారవేతనం

**ఆరు గ్యారంటీలకు పెద్దపీఠ**

- 6 గ్యారంటీలకు 50,713కోట్లు
- రైతు భరోసాకు 18,000 కోట్లు
- చేయుతకు 14,861 కోట్లు
- ఇందిరమ్మ ఇండ్లకు 5,500 కోట్లు
- మహాలక్ష్మికి 4,305 కోట్లు
- సన్న వడ్ల బోనస్ కు 3,500 కోట్లు
- గృహ జ్యోతి (200 యూనిట్లు ఉచిత విద్యుత్) 2,080 కోట్లు
- రాజీవ్ ఆరోగ్య శ్రీ 1,143 కోట్లు
- మహాలక్ష్మి పథకం కింద గ్యాస్ సబ్సిడీ 723 కోట్లు
- ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కు 600 కోట్లు
- పవర్ సబ్సిడీకి 14,000 కోట్లు
- బియ్యం సబ్సిడీ 3,000 కోట్లు

# సామాన్యుడిపై 'ధరల' పిడుగు

- రెండు వారాల్లోనే ఆకాశానికి నిత్యావసరాలు
- కేంద్రంపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు

**హైదరాబాద్, మహా:** దేశవ్యాప్తంగా నిత్యావసర సరుకులతో పాటు వివిధ రకాల వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. కేవలం గత రెండు వారాల వ్యవధిలోనే సామాన్యుల నడ్డి విరిచేలా అనేక వస్తువుల ధరలు భారీగా పెరిగాయని, ఈ అడ్డూ అదుపూ లేని ధరల పెరుగుదలతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ ఆవేదన వ్యక్తం చేసింది. రోజువారీ అవసరాలకు వినియోగించే వస్తువుల నుండి ప్రయాణ ఖర్చుల వరకు అన్నింటి పైనా కేంద్రం భారం మోపుతోందని ప్రతిపక్ష నాయకులు ఆరోపించారు.

గడిచిన పదిహేను రోజుల్లోనే పెరిగిన ధరల వివరాలను కాంగ్రెస్ పార్టీ ప్రముఖంగా ప్రస్తావించింది. ముఖ్యంగా సామాన్యుడి వంటగదిపై భారం మోపుతూ కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర ఏకంగా 146 రూపాయలు పెరగ్గా, గృహ వినియోగ డొమెస్టిక్ సిలిండర్ ధరపై 60 రూపాయల అదనపు భారం పడిందని పేర్కొంది. అదేవిధంగా వంటనూనెల ధరలు సైతం వినియోగదారులకు షాక్ ఇస్తున్నాయి. రిఫైన్డ్ ఆయిల్ లీటరుకు 30 రూపాయలు, పామ్ ఆయిల్ లీటరుకు 15 రూపాయల చొప్పున పెరగడం గమనార్హం. ఇక ఇంధన ధరల విషయానికి వస్తే, పరిశ్రమల్లో వినియోగించే ఇండస్ట్రియల్ డీజిల్ లీటరుకు 22 రూపాయలు, ప్రీమియం పెట్రోల్ లీటరుకు 2.35 రూపాయల మేర పెరిగి రవాణా, పారిశ్రామిక వర్గాలను కలవరపెడుతున్నాయి.

కేవలం నిత్యావసరాలే కాకుండా ఇతర సేవల రుసుములు, గృహోపకరణాల ధరలు కూడా సామాన్యులకు అందనంత దూరంలోకి వెళ్తున్నాయని కాంగ్రెస్ విమర్శించింది. ప్రముఖ ఆన్ లైన్ ఫుడ్ డెలివరీ యాప్ జొమాటో తన డెలివరీ ఫీజును 2.40 రూపాయలు పెంచగా, విమాన ప్రయాణ టికెట్ల ధరలు ఏకంగా 425 రూపాయల నుంచి 2,300 రూపాయల వరకు పెరిగి ప్రయాణికుల జేబులకు చిల్లులు పెడుతున్నాయి. అంతేకాకుండా, ప్లాస్టిక్ బాటిల్ సెట్ పై 40 రూపాయలు పెరగ్గా, ఇండక్షన్ స్టవ్ ల ధర రికార్డు స్థాయిలో 40 శాతం మేర పెరగడం ఆందోళన కలిగిస్తోందని కాంగ్రెస్ పార్టీ గుర్తుచేస్తోంది. ఈ స్థాయిలో సాగుతున్న ధరల పెంపుతో సామాన్యులు బతికే పరిస్థితి లేదని కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వ విధానాలపై తీవ్ర స్థాయిలో మండిపడింది.

# పిల్లల ఆరోగ్యంపై గ్రామస్థుల 'సర్జికల్ స్ట్రైక్'

- ఐస్ క్రీం బండ్ల రాకపై కఠిన నిషేధం!
- వస్తే ఐస్ క్రీం.. వెళ్తే రూ.5,000 జరిమానా...
- గూడూరు పొలిమేరల్లో వెలిసిన హెచ్చరిక బోర్డులు!
- కల్తీ ఐస్ క్రీంల అడ్డుకట్టకు ఒక పల్లెటూరు సాహసోపేత నిర్ణయం!




**హైదరాబాద్, మహా:** మారుతున్న కాలంతో పాటు ఆహారపు అలవాట్లు మారుతున్నాయి, కానీ ఆ అలవాట్లు మన తర్వాతి తరం ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయనే చేదు నిజాన్ని గూడూరు గ్రామస్థులు గుర్తించారు. వేసవి కాలం వచ్చిందంటే చాలు రంగురంగుల ఐస్ క్రీంలతో వచ్చే ఆటోలు, బండ్లు పిల్లలను ఆకర్షిస్తుంటాయి. అయితే ఈ ఐస్ క్రీంలలో వాడే రసాయనాలు, కల్తీ పదార్థాల వల్ల తమ పిల్లలు అనారోగ్యం పాలవుతున్నారని గమనించిన ఆ గ్రామ పెద్దలు, యువత కలిసి ఒక ఐక్యమత్య నిర్ణయానికి వచ్చారు. కేవలం మాటలతో కాకుండా, ఏకంగా జరిమానాలు విధిస్తూ గ్రామంలోకి ఐస్ క్రీం విక్రయదారుల ప్రవేశాన్ని అడ్డుకోవడం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. సాధారణంగా గ్రామ సరిహద్దుల్లో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు లేదా పండుగ శుభాకాంక్షల బ్యానర్లు కనిపిస్తాయి. కానీ చింతూరు మండలం గూడూరు గ్రామ పొలిమేరల్లో మాత్రం వినూత్నమైన హెచ్చరిక బోర్డులు దర్శనమిస్తున్నాయి. "మా గ్రామంలోకి ఐస్ క్రీమ్ ఆటోలకు మరియు ఐస్ క్రీమ్ బండ్లకి ప్రవేశము లేదు. ఒకవేళ ఎవరైనా నిబంధనలను ఉల్లంఘించి గ్రామంలోకి వస్తే రూ. 5,000 జరిమానా విధించబడును" అనే స్పష్టమైన సందేశంతో ఈ బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ నిర్ణయం తీసుకోవడానికి బలమైన కారణమే ఉందని గ్రామస్థులు చెబుతున్నారు. ఇటీవల కాలంలో గ్రామంలోకి వస్తున్న ఐస్ క్రీం బండ్లలో నాణ్యత లేని, కల్తీ ఐస్ క్రీంలను విక్రయిస్తున్నారని, వాటిని తిన్న పిల్లలకు పంటి సమస్యలు, కడుపు నొప్పి వంటి అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారులు వాడే ఐస్ క్రీంలలో పాలు లేదా నాణ్యమైన పదార్థాలకు బదులుగా హానికరమైన రంగులు, రసాయనాలు వాడుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామంలోని కొందరు పిల్లలు వరుసగా అనారోగ్యానికి గురికావడంతో గ్రామ పంచాయతీ మరియు పెద్దలు సమావేశమై ఈ కఠిన నిర్ణయాన్ని తీసుకున్నారు. ఇది కేవలం తాత్కాలిక నిర్ణయం కాదని, పిల్లల భవిష్యత్తు కోసం తీసుకున్న బాధ్యతాయుతమైన అడుగు అని వారు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికే ఈ గ్రామం గతంలో అక్రమ మద్యం అమ్మకాలను కూడా అరికట్టి తమ ఐక్యతను చాటుకుంది. ఇప్పుడు ఐస్ క్రీం బండ్ల నిషేధం ద్వారా ప్రజారోగ్యం విషయంలో తాము ఎంత కఠినంగా ఉంటామో మరోసారి నిరూపించారు. ఈ వినూత్న ప్రయత్నం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్ల నుంచి ప్రశంసలు అందుతున్నాయి. "ప్రభుత్వాలు చేసే వరకు వేచి చూడకుండా, తమ గ్రామాన్ని తామే రక్షించుకోవాలనే గూడూరు గ్రామస్థుల ఆలోచన ఆదర్శనీయం" అని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. మరికొందరు మాత్రం విక్రయదారుల జీవనోపాధిని దృష్టిలో పెట్టుకుని, నిషేధానికి బదులుగా నాణ్యతను తనిఖీ చేసే వ్యవస్థ ఉంటే బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు. ఏది ఏమైనా, తన సంతానం ఆరోగ్యం కోసం ఒక పల్లె తీసుకున్న ఈ 'కోల్డ్ వార్' ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఇతర గ్రామాల్లో కూడా చర్చకు దారి తీస్తోంది.

# ఎఫ్ఎస్ఎల్ నియామక ఫలితాలు విడుదల


## టిఎస్ఎల్ పిఆర్ బి చైర్మన్ వి.వి. శ్రీనివాసరావు



**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్ర ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ లో ఖాళీగా ఉన్న వివిధ విభాగాల పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తి చేసినట్లు తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక బోర్డు చైర్మన్ వి.వి. శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 నవంబర్ 14న జారీ చేసిన నోటిఫికేషన్ ద్వారా మొత్తం 60 పోస్టులకు గాను 59 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేశామన్నారు. ఈ ఎంపికలో భాగంగా సైంటిఫిక్ ఆఫీసర్ (ఫిజికల్/జనరల్) విభాగంలో 2 ఖాళీలకు ఇద్దరు పురుషులు, సైంటిఫిక్ ఆఫీసర్ (కెమికల్)లో 3 ఖాళీలకు ఇద్దరు పురుషులు, ఒక మహిళా అభ్యర్థి ఎంపికయ్యారని వివరించారు. అలాగే సైంటిఫిక్ ఆఫీసర్ బయాలజీ/సెరోలజీలో 3 ఖాళీలకు ఒక పురుషుడు, ఇద్దరు మహిళలు, కంప్యూటర్స్ విభాగంలో 2 ఖాళీలకు ఒక్కొక్కరు చొప్పున పురుష, మహిళా అభ్యర్థులు ఎంపికయ్యారు. సైంటిఫిక్ అసిస్టెంట్ విభాగాల్లో ఫిజికల్/జనరల్ లో 5 ఖాళీలకు నలుగురు పురుషులు, ఒక మహిళా అభ్యర్థి, కెమికల్ లో 10 ఖాళీలకు 8 మంది పురుషులు, ఒక మహిళా అభ్యర్థి (మొత్తం 9) ఎంపికయ్యారు. బయాలజీ/సెరోలజీలో 10 ఖాళీలకు నలుగురు పురుషులు, ఆరుగురు మహిళలు, కంప్యూటర్స్ లో 7 ఖాళీలకు ఆరుగురు పురుషులు, ఒక మహిళా అభ్యర్థిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ల్యాబొరేటరీ టెక్నీషియన్ విభాగంలో ఫిజికల్/జనరల్ లో 2 ఖాళీలకు ఇద్దరు పురుషులు, కెమికల్ లో 6 ఖాళీలకు నలుగురు పురుషులు, ఇద్దరు మహిళలు, బయాలజీ/సెరోలజీలో 4 ఖాళీలకు ఒక పురుషుడు, ముగ్గురు మహిళలు, కంప్యూటర్స్ లో 5 ఖాళీలకు ముగ్గురు పురుషులు, ఇద్దరు మహిళలు ఎంపిక కాగా, ల్యాబొరేటరీ అటెండెంట్ లో ఉన్న ఒక్క ఖాళీకి ఒక పురుష అభ్యర్థి ఎంపికయ్యారని చైర్మన్ వివరించారు. అభ్యర్థుల అకడమిక్ మార్కులు, పని అనుభవం మరియు రాత పరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగా ఈ ఎంపికలు జరిగాయని, ఎంపికైన వారు ఈ నెల 23 నుండి 25వ తేదీ వరకు వెబ్‌సైట్‌లో అటెస్టేషన్ ఫారాలను పూర్తి చేసి, మార్చి 30న హైదరాబాద్‌లోని పెట్లబుర్జ్ సిటీ ఆర్మ్డ్ రిజర్వ్ కార్యాలయంలో సమర్పించాలని ఆయన సూచించారు.

EDITORIAL సంపాదకీయం

# తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల సమస్య



భారతదేశంలో 140 కోట్ల జనాభాలో సుమారు 80 కోట్లు మంది బీసీ వర్గాలకి చెందినవారు. ఈ విస్తృత జనాభా సమస్యలను పట్టించుకోకుండా, కొంతమంది దీనిని చిన్న సమస్యగా భావించడం చాలా దురదృష్టకరం. తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల సమయంలో ప్రభుత్వం బీసీలకు స్థానికసంస్థల్లో 42% రిజర్వేషన్లు చట్టబద్ధంగా కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చింది. అయితే, రెండేళ్ల గడిచినప్పటికీ, ఈ హక్కులను అమలు చేయడానికి ఎటువంటి నిర్ణాయక చర్యలు తీసుకోలేదు. బీసీల ఓట్లు మాత్రమే సేకరించడానికి, కులగణనలో తప్పులు చూపించడం, బీసీల జనాభాను తగ్గించడం, రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చడానికి వాగ్దానం చేసి కేంద్రానికి పంపి తర్వాత చర్యలేకుండా వదిలేయడం జరుగుతోంది.

కేంద్ర ప్రభుత్వం సహకారం అందించనప్పటికీ, స్థానిక అధికారులు సరైన సమన్వయం, అఖిల పక్ష సమావేశాలు, ధర్నాలు నిర్వహించక, బీసీల హక్కులను రక్షించడంలో విఫలమయ్యారు. కొంతమంది 50% సీలింగ్‌ను దాటితే కోర్టులు రద్దు చేస్తాయి అని అంటున్నా, ఇది రాజకీయ వ్యాఖ్య మాత్రమే. వాస్తవానికి, 50% సీలింగ్ EWS రిజర్వేషన్ల సందర్భంలో ఇప్పటికే దాటిపోయింది, చట్టబద్ధంగా 60% రిజర్వేషన్లు అమలు అవుతున్నాయి, 2022లో జనహిత వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీం కోర్టు ఇదే తీర్పు ఇచ్చింది. 50% సీలింగ్ రాజ్యాంగ మూల సూత్రం కాదని, దాటవచ్చు అని స్పష్టం చేశారు. కాబట్టి బీసీలకు 42% సాధ్యం కాదని తర్కం స్థిరంగా నిలవదు. కొంతమంది 9వ షెడ్యూల్‌లో బీసీ రిజర్వేషన్లు చేర్చడంపై కూడా విమర్శలు చేస్తున్నారు. 9వ షెడ్యూల్‌లో చేర్చినంత మాత్రాన రక్షణ ఉంటుందా అనే సందేహాలు ఉంటాయి. నిజానికి, 2007లో కోహిలి కేసులో జ్యుడిషియల్ రివ్యూ జరిగింది, కానీ తరువాత 9వ షెడ్యూల్‌లో చేర్చితే అది కేంద్ర హక్కులను భంగం చేయదు. ప్రైవేట్ బిల్లులు, జీవోలు ద్వారా బీసీల హక్కులను మళ్లీ మభ్యపెట్టడం, మోసపుచడం అనవసరం. కొంతమంది కోర్టులు కొట్టేస్తాయి అని చెబుతున్నారు, కానీ ప్రభుత్వ జీవోలను స్టే చేయించడం ద్వారా మోసాలు జరగకుండా చర్యలు తీసుకోవచ్చు. తెలంగాణలో బీసీల సమస్యలను పట్టించుకుని, తక్షణమే చట్టపరమైన, సమగ్ర మరియు సంక్లిష్ట రక్షణ చర్యలు చేపట్టడం సమాజానికి, రాష్ట్రానికి అవసరం.

### బీసీలకు చట్టబద్ధ రక్షణ అవసరం

తెలంగాణ రాష్ట్రంలో బీసీలు అత్యధిక సంఖ్యలో ఉన్న వర్గం. 2014 సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం బీసీలు రాష్ట్ర జనాభాలో 61%, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేసిన సర్వే ప్రకారం 56.33% ఉంటాయి. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే, తెలంగాణలో బీసీ జనాభా అత్యధికంగా ఉంది. అయితే, ఇంత పెద్ద జనాభా ఉన్నప్పటికీ, బీసీలు రాజకీయ, ఆర్థిక, సామాజిక, విద్యా, ఉద్యోగ రంగాలలో సరైన ప్రాతినిధ్యం పొందలేదు. హాస్పిటల్‌లు, కాలేజీలు, వ్యాపారం, రాజకీయాలు, సినిమా పరిశ్రమలో కొన్ని ఆధిపత్య కులాలు మాత్రమే ప్రధాన పాత్రలు పోషిస్తూ, బీసీ వర్గాన్ని అణిచివేస్తున్నాయి. ప్రస్తుతానికి బీసీ రిజర్వేషన్లు, విద్యా, ఉద్యోగ అవకాశాల్లో చట్టబద్ధ రక్షణ లేకపోవడం గమనించదగిన విషయం. బీసీ వర్గంపై వివక్ష, మోసాలు, ప్రాధాన్యం లేకపోవడం కొనసాగుతోంది. భారత రాజ్యాంగం 15వ, 16వ, 46వ అధికరణల ద్వారా వివిధ కుల వర్గాలకు SC, ST, OBC వారిని సమాన అవకాశాలతో ముందుకు తీసుకువచ్చే విధంగా రిజర్వేషన్లు కల్పిస్తుంది. బీసీ వర్గానికి రాష్ట్ర స్థాయిలో రిజర్వేషన్లు ఉన్నప్పటికీ, వీటి అమలు మరియు రక్షణకు ప్రత్యేకంగా "బీసీ రక్షణ చట్టం" లేదు. ఎస్సీ,ఎస్టీ వర్గాలకు "చట్టం ఉన్నప్పటికీ, బీసీ వర్గం కోసం అలాంటి చట్టం లేవు. దాంతో ఏవైనా వివక్ష, హింస, అసమానత ఘటనలపై సాధారణ ఐపీసీ మరియు రిజర్వేషన్ల అమలు మాత్రమే మార్గం అవుతుంది.

తెలంగాణలో బీసీ జనాభా ఎక్కువగా ఉన్నప్పటికీ, వారు రాజకీయ, సామాజిక, విద్యా మరియు ఉద్యోగ రంగాలలో తగిన ప్రాతినిధ్యం పొందలేకపోతున్నారు. వారి హక్కులను, ప్రతినిధిత్వాన్ని భద్రపరచడానికి ప్రత్యేక చట్టం లేకపోవడం పెద్ద సమస్యగా ఉంది. అందుకే బీసీ సమాజం తరఫున, SC/ST రక్షణ చట్టం వంటిది బీసీ వర్గానికి కూడా రూపొందించాలని డిమాండ్ ఎక్కువగా ఉంది.

తెలంగాణలో బీసీ వర్గాల సమస్యలను, వివక్షను అడ్డుకోవడానికి, వారి రిజర్వేషన్లు, ఉద్యోగాలు, విద్యా అవకాశాలను కాపాడడానికి బీసీ రక్షణ చట్టం రూపొందించడం అత్యవసరం. ఇది బీసీల హక్కులను భద్రపరిచి, వివక్ష చూపుతున్న వారిపై తక్షణమే చర్యలు తీసుకునే విధంగా ఉండాలి.

### తెలంగాణలో బీసీ మహిళల కోసం సబ్-కోటా అవసరం

తెలంగాణలో బీసీ మహిళలు రాజకీయ ప్రాతినిధ్యం, రిజర్వేషన్ల పరంగా తరచుగా మోసపోతున్నారనేది నిజం. మహిళా కోటా నిబంధనలు సాధారణంగా అన్ని వర్గాల మహిళలపై వర్తిస్తాయి. కానీ బీసీ మహిళలు, జనాభాలో పెద్ద వర్గం అయినప్పటికీ, సామాన్యంగా కోటా అవకాశాల్లో తక్కువ ప్రాతినిధ్యం పొందుతున్నారు. ఈ పరిస్థితి కేవలం శక్తివంతమైన వర్గాలే ఈ కోటాను ఆక్రమించడం వల్ల ఏర్పడుతుంది. ప్రస్తుతానికి బీసీ మహిళలకు ప్రత్యేక సబ్‌కోటా లేదు. అందువల్ల, స్థానిక పాలన, మునిసిపల్, గ్రామ స్థాయిలలో బీసీ మహిళల హక్కులు పరిమితమవుతున్నాయి. బీసీ మహిళల రాజకీయ శక్తి తగ్గిపోవడం, ప్రాతినిధ్యం లేకపోవడం అనేది వారి సమాజంలో వర్గీయ అసమానతలను మరింత పెంచుతోంది. ప్రస్తుతం మహిళా కోటా (33%) అన్ని వర్గాల మహిళలకు వర్తిస్తుండగా, బీసీ మహిళలు సాధారణంగా ప్రముఖ వర్గాల ఆక్రమణ కారణంగా కోటా అవకాశాల్లో మోసపోతున్నారు. ఇది రాజకీయ, సామాజిక మరియు ఆర్థిక శక్తి సమతుల్యాన్ని బద్ధకం చేస్తోంది. అందువల్ల మహిళా బిల్లులో బీసీ సబ్‌కోటా అమలు చేయడం అత్యవసరం. ఇది బీసీ మహిళలకు నిర్బంధమైన రిజర్వేషన్ల హక్కు కల్పిస్తుంది. స్థానిక మరియు రాష్ట్ర పాలనలో సమగ్ర ప్రాతినిధ్యం పెంచుతుంది. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో బీసీ మహిళల శక్తి సమానంగా ఉపయోగపడుతుంది. తెలంగాణలో బీసీ మహిళలు ఇంకా రాజకీయంగా, రిజర్వేషన్ల పరంగా మోసపోతోన్న ఈ పరిస్థితిని అర్థం చేసుకుని, మహిళా బిల్లులో బీసీ సబ్‌కోటా అమలు చేయడం సమాజంలో సమానత్వానికి, సామాజిక న్యాయానికి, బీసీ వర్గాల శక్తివృద్ధికి కీలకం.



- బసడ సంపత్ యాదవ్
7032132593

రచనలకు ఆహ్వానం
ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp:
74369 39999

# కొత్త పథకాలు.. కోటి ఆశలు



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకాలతో.. కోటి ఆశలు కల్పించింది. ఇంకా ప్రారంభం కాని పథకాలు ఊరిస్తున్నా.. కొత్త పథకాలు ఎంతో కొంత మేలుచేసేవిగా ఉన్నాయని, ప్రధానంగా విద్య, ఆరోగ్య రంగాలకు పెద్దపీట లభించిందన్న విశ్లేషణలు భట్టి విక్రమార్క పద్దుపై ఉన్నాయి.

### ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా :

రాష్ట్రంలోని ప్రజలందరి సంక్షేమం కోసం పేద, ధనిక అనే తేడా ల్లేకుండా 1.15 కోట్ల కుటుంబాలకు ఈ పథకం ద్వారా రూ.5 లక్షల జీవిత బీమాను కాంగ్రెస్ ప్రభుత్వం అందించనుంది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2వ తేదీ నుంచి ఈ కొత్త పథకం అమల్లోకి రానుంది. సామాజిక అంతరాలతో సంబంధం లేకుండా.. పేద, ధనిక అనే బేధాలు చూడకుండా అందరికీ ఈ పథకాన్ని వర్తింపజేస్తామని భట్టి విక్రమార్క తెలిపారు.

### చేయూత :

'చేయూత' పథకం కింద కొత్తగా 2 లక్షల పెన్షన్లను ఆమోదించినట్లు బడ్జెట్ సమావేశాల సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు. దీనికి బడ్జెట్‌లో రూ.14,861 కోట్ల కేటాయించారు.

### తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు :

202627 విద్యా సంవత్సరం నుండి రాష్ట్రవ్యాప్తంగా 100 నియోజకవర్గాల్లో అత్యాధునిక వసతులతో 'తెలంగాణ పబ్లిక్ స్కూల్స్' ఏర్పాటు కు బడ్జెట్‌లో ఆమోదం లభించింది. ఎంపిక చేసిన ప్రస్తుత ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక, డిజిటల్ , మౌలిక సదుపాయాలను పెంచి టీచర్లకు శిక్షణ ఇవ్వడం దీని ముఖ్య ఉద్దేశం. ప్రీప్రైమరీ నుండి ఇంటర్ వరకు విద్యార్థులకు నాణ్యమైన విద్య ను అందించేందుకు తీసుకొచ్చిన ఈ స్కీమ్ కు బడ్జెట్‌లో రూ.500 కోట్ల కేటాయించారు.

### విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ :

ప్రీప్రైమరీ నుండి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు నాణ్యమైన పోషకాలతో కొత్తగా బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ అమలు కానుంది. ప్రతీ విద్యార్థికి వారానికి మూడు రోజులు పాలు, మిగిలిన రోజుల్లో రాగి జావ ఇస్తారు. రానున్న విద్యా సంవత్సరం నుంచి ఈ విధానం అమల్లోకి రానుంది. బడ్జెట్‌లో రూ.800 కోట్ల కేటాయింపు జరిగింది.

### ఇంటర్ విద్యార్థులకు మిడ్-డే మీల్స్ :

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఇకపై మధ్యాహ్న భోజన సదుపాయం. బడ్జెట్‌లో రూ.100 కోట్ల కేటాయించారు.

### నగదు రహిత ఆరోగ్య భద్రత పథకం:

ఉద్యోగులు, పెన్షనర్లు, వారిపై ఆధారపడిన దాదాపు 23.51 లక్షల మందికి నగదు రహిత ఆరోగ్య భద్రత పథకం అమలు కానుంది. రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్టు ద్వారా అమలు. ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు ప్రైవేట్‌కార్పొరేట్ ఆసుపత్రులలో 1,998 వ్యాధులకు చికిత్స. ప్రతీ ఉద్యోగికి డిజిటల్ హెల్త్ కార్డు ఇస్తారు.

### ఉద్యోగుల ప్రమాద బీమా పథకం:


ఉద్యోగుల భద్రత కోసం దేశంలోనే తొలిసారిగా సమగ్ర ప్రమాద బీమా పథకంను భట్టి విక్రమార్క ప్రకటించారు. ఈ స్కీమ్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ప్రమాదవశాత్తు మరణిస్తే 1.20 కోట్ల ప్రమాద బీమా వస్తుంది. 60 ఏండ్ల వరకు రూ. 10 లక్షల టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఉంటుంది . విమాన ప్రమాదంలో మరణిస్తే రూ. 2 కోట్ల అదనపు కవరేజ్ ఇవ్వబడుతుంది. . సుమారు 7.57 లక్షల ఉద్యోగులు, పెన్షనర్లకు ఈ స్కీమ్ ద్వారా బెనిఫిట్ అందుతోంది. బడ్జెట్‌లో దీనికి రూ. 1,056 కోట్ల కేటాయింపు జరిగింది.

### సీఎం ఓవర్సీస్ ఎంప్లాయిమెంట్ ప్రోగ్రాం:

యువతకు వివిధ రంగాలలో తగిన నైపుణ్య శిక్షణను, వారికి ఉపాధి లభించిన దేశాల్లో భాషా జ్ఞానంలో శిక్షణ ఇప్పించడం, వీసా అసిస్టెన్స్, విదేశీ ప్రయాణ ఏర్పాట్లు, విదేశాలలో ఆరోగ్య సేవలు, హస్పిటాలిటీ, నిర్మాణపు పనులు, లాజిస్టిక్స్ వంటి రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు 'సీఎం ఓవర్సీస్ ఎంప్లాయిమెంట్ ప్రోగ్రాం' తీసుకొచ్చారు . బడ్జెట్‌లో ఈ స్కీమ్ కు రూ.1,056 కోట్ల కేటాయింపు జరిగింది.

### ఏటీసీ ట్రైనీలకు స్కాలర్ షిప్:

ఈ స్కీమ్ ద్వారా ఏటీసీ (ఐటీఐ)లలో శిక్షణలో ఉన్న ట్రైనీలకు ప్రతి నెలా రూ. 2 వేల చొప్పున స్కాలర్ షిప్ ఇవ్వబడుతుంది. బడ్జెట్‌లో రూ.80 కోట్ల కేటాయించారు.



# హర్యానాలో గుండెపోట్లు

**ఆరేళ్లలో 18 వేల మంది యువత మృతి.. మీ వయసు 18-45 మధ్య ఉంటే జాగ్రత్త**

**హర్యానాలో గత ఆరేళ్లలో 18-45 ఏళ్ల వయసున్న సుమారు 18,000 మంది గుండెపోటుతో మరణించినట్లు అసెంబ్లీ గణాంకాలు వెల్లడించాయి. యువతలో పెరుగుతున్న ఈ ప్రాణాంతక ముప్పును అరికట్టడానికి వైద్య నిపుణులు ఇస్తున్న కీలక సూచనలివే.**

గుండె జబ్బులు అంటే కేవలం వృద్ధులకు మాత్రమే వచ్చేవి అనే పాత నమ్మకాన్ని హర్యానాలో నమోదైన గణాంకాలు పటాపంచలు చేస్తున్నాయి. రాష్ట్ర అసెంబ్లీలో బుధవారం వెల్లడైన ఒక నివేదిక ఆరోగ్య రంగంలో కలకలం రేపుతోంది. గత ఆరేళ్ల కాలంలో హర్యానాలో 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయసున్న సుమారు 18,000 మంది గుండెపోటు లేదా హార్ట్ ఫెయిల్యూర్ కారణంగా ప్రాణాలు కోల్పోయారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యే అడిగిన ప్రశ్నకు ప్రభుత్వం ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో ఈ దిగ్భ్రాంతికర విషయాలు వెలుగుచూశాయి. 2020 తర్వాత యువతలో గుండె సంబంధిత మరణాలు పెరగడానికి కోవిడ్ 19 ఇన్ఫెక్షన్లు లేదా వ్యాక్సినేషన్ సైడ్ ఎఫెక్ట్స్ కారణమా? అని ఎమ్మెల్యే ప్రశ్నించగా.. దీనిపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక సర్వే లేదా పరిశోధన జరగలేదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

### ఏం చెబుతున్నాయి అధ్యయనాలు?

2025లో ఎయిమ్స్ (AIIMS), ఐసీఎంఆర్ (ICMR) సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనం ప్రకారం.. భారత్‌లో 1845 ఏళ్ల మధ్య వయసున్న ఆరోగ్యవంతులు అకస్మాత్తుగా మరణించడానికి ప్రధాన కారణం 'గుర్తించని గుండె జబ్బులే'. ఈ తరహా మరణాల్లో 42.6 శాతం గుండె సమస్యల వల్లే జరుగుతున్నాయి. మిగిలిన కేసుల్లో వంశపారంపర్యంగా వచ్చే గుండె సమస్యలు (Inherited electrical disorders) ఉండవచ్చని నిపుణులు భావిస్తున్నారు.

### వయసును బట్టి గుండెను కాపాడుకోండి ఇలా..

ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ బిమల్ ఛాజెర్ అభిప్రాయం ప్రకారం.. 20 లేదా 30 ఏళ్లలో ఉన్నప్పుడు 'మాకేం కాదులే' అనే అతివిశ్వాసం ప్రమాదకరం. అందుకే ప్రతి దశలోనూ గుండెను కాపాడుకోవడానికి ప్రత్యేక శ్రద్ధ అవసరమని ఆయన సూచిస్తున్నారు.

### 20 ఏళ్ల వయసులో: ఆరోగ్యానికి పునాది

ఈ వయసులో అలవాటు చేసుకునే జీవనశైలి మీ గుండె భవిష్యత్తును నిర్ణయిస్తుంది.

**ఆహారం**

తృణధాన్యాలు, తాజా పండ్లు, తక్కువ కొవ్వు ఉండే ప్రొటీన్లు తీసుకోవాలి. జంక్ ఫుడ్, అధిక ఉప్పు, వేపుళ్లకు దూరంగా ఉండాలి.

**వ్యాయామం**

వారానికి కనీసం 150 నిమిషాల పాటు వేగంగా నడవడం, ఈత కొట్టడం లేదా సైక్లింగ్ వంటి వ్యాయామాలు తప్పనిసరి.

**మానసిక ఆరోగ్యం**

కెరీర్ ప్రారంభంలో వచ్చే ఒత్తిడిని తగ్గించుకోవడానికి ధ్యానం లేదా శ్వాస వ్యాయామాలు అలవాటు చేసుకోవాలి.

### 30, 40 ఏళ్ల వయసులో: నిత్యం అప్రమత్తత

ఈ వయసులో కుటుంబం, ఉద్యోగ బాధ్యతల వల్ల శారీరక శ్రమ తగ్గుతుంది. ఇక్కడే హైబీపీ, కొలెస్ట్రాల్ వంటి 'సైలెంట్ కిల్లర్స్' ప్రవేశిస్తాయి. "చాలామంది కెరీర్ బిజీలో పడి వ్యాయామాన్ని పక్కన పెడుతున్నారు. నిజానికి ఈ సమయంలోనే గుండెకు కదలిక చాలా అవసరం" అని డాక్టర్ ఛాజెర్ పేర్కొన్నారు.

### ఆయన ఇచ్చిన కీలక సలహాలివే:

**పరీక్షలు:**

బీపీ, కొలెస్ట్రాల్, షుగర్ లెవల్స్‌ను క్రమం తప్పకుండా పరీక్షించుకోవాలి. సమస్యను ముందుగా గుర్తిస్తే పెద్ద ప్రమాదాన్ని నివారించవచ్చు.

**కదలిక:**

జిమ్‌కు వెళ్లే సమయం లేకపోతే ఇంట్లోనే యోగా చేయడం లేదా ఇంటి పనుల ద్వారా శరీరానికి శ్రమ కలిగించడం ద్వారా గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. ముంబైలోని హీరానందని హాస్పిటల్ కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ప్రతీక్ గిరి కూడా యువ భారతీయుల్లో గుండెపోటు ముప్పు పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆధునిక జీవనశైలి మార్పులే దీనికి ప్రధాన కారణమని ఆయన విశ్లేషించారు. గుండె ఆరోగ్యం అనేది జీవితకాల నిబద్ధత. హర్యానా గణాంకాలు మనకు ఒక హెచ్చరిక లాంటివి. 'యువకులం కదా మాకు గుండె జబ్బులు రావు' అనే భ్రమ నుంచి బయటపడి నేటి నుంచే జాగ్రత్తలు తీసుకోవడం అవసరం.

### తరచుగా అడిగే ప్రశ్నలు

**1. యువతలో గుండెపోటు పెరగడానికి కారణమేంటి?**

ప్రధానంగా మారిన జీవనశైలి, శారీరక శ్రమ లేకపోవడం, జంక్ ఫుడ్, ఒత్తిడి, గుర్తించని జన్యుపరమైన గుండె సమస్యలు కారణమవుతున్నాయి.

**2. హర్యానాలో ఆరేళ్లలో ఎంత మంది చనిపోయారు?**

18 నుంచి 45 ఏళ్ల మధ్య వయసున్న సుమారు 18,000 మంది మరణించినట్లు ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి.

**3. వారానికి ఎంత వ్యాయామం అవసరం?**

కనీసం 150 నిమిషాల పాటు మోస్తరు తీవ్రత గల వ్యాయామం (బ్రిస్క్ వాకింగ్ వంటివి) గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

## రంజాన్ సందర్భంగా ముస్లింలకు తోఫా అందజేత




**బెల్లంపల్లి, మహా:** తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రంజాన్ తోఫా ను బెల్లంపల్లిఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు వార్డ్ ముస్లిం సోదరులకు 28వ వార్డు పరిధిలో వార్డు కౌన్సిలర్ చిప్ప అర్చన మనోహర్ శుక్రవారంనాడు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఒక నెల రోజుల పాటు ఎంతో విశిష్టతగా ఉపవాస దీక్షలు సంతోషం గా పూర్తిచేయడం చాలా గొప్ప విషయం అని తెలియా చేశారు అలాగే వార్డ్ ప్రజలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియాచేసి ప్రతి ఒక్కరు పండుగ ను సంతోషంగా జరుపుకోవాలని,ఆ భగవంతుడి దీవెనలు ప్రజల పై ఎల్లవేళలా ఉండాలని,పట్టణ ప్రజలు సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.వార్డ్ మహిళలు మాట్లాడుతూ ఇలా పండుగ పూట ఎంతో చక్కటి రంజాన్ తోఫా ను పంపిన ఎమ్మెల్యే గడ్డం వినోద్ కి మహిళలు కృతజ్ఞతలు తెలిపారు.అలాగే ఎమ్మెల్యే ఎల్లపుడు సంతోషంగా ఉండాలని ఆ అల్లా దేవుని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామనిపేర్కొన్నారు. వారితో పాటు పార్టీ సీనియర్ నాయకులు రాసభత్తుల వెంకటి,సాధిక్,నాయకులుమల్లేష్,అలీభాయ్,సలీమ్ ,తాజ్,యూనుస్,శ్రీకాంత్,,సలీం,జాఫర్,మోహన్,రాజాం,చక్రి,గార్లు మరియు వార్డ్ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ వేడుకలకు ముస్తాబైన ఆమనగల్లు మసీదులు

**ఆమనగల్లు, మహా :** ఆమనగల్లు పట్టణంలో రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. జామ మజీద్, మహ్మదీయ మజీద్, హిలాలే మజీద్లను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఈద్గా వద్ద ప్రత్యేక షామియానాలు ఏర్పాటు చేశామని కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు ఈద్గా వద్దసామూహిక ప్రార్థనలు నిర్వహించనున్నారు. పండుగ సందర్భంగా ముస్లిం సోదరులు ప్రార్థనల్లో పాల్గొనేందుకు వీలుగా అన్ని సౌకర్యాలను కల్పించామని నిర్వాహకులు వెల్లడించారు.




TELANGANA PRADESH CONGRESS COMMITTEE

Kandi Srinivasa Reddy

MLA Contested

Incharge: Adilabad Assembly Constituency

I submit that presently the MARKFED/ NAFED is procuring Bengalgram @ 7.13 Quintals per acre on Minimum Support price from the farmers in Adilabad District. During this season the Bengalgram crop is received High yield due to good Whether conditions in Adilabad District. Hence the farmers are requesting to procure @ 10 Quintals per Acre by the MARKFED/ NAFED for the benefit of farmers as presently the price of Bengalgram is very low in open market and farmers are put to financial loss due to sale in open market.

I therefore request the Hon'ble Minister for Agriculture, Marketing, Co-operation, and Handlooms & Textiles, Govt. Of Telangana, Hyderabad to kindly arrange to procure Bengalgram @ 10 Quintals per Acre by the MARKFED/ NAFED for the welfare of farmers of Adilabad District and oblige.

With Kind Regards,

Yours sincerely,

(Kandi Srinivas Reddy)

Congress Party I/c Adilabad AC.

## కొనుగోళ్ల పరిమితి పెంచాలంటూ మంత్రికి కంది శ్రీనివాస రెడ్డి వినతి

**ఆదిలాబాద్ మహా :** శనగ కొనుగోళ్ల పరిమితిని పెంచాలంటూ ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్చార్జి కంది శ్రీనివాసరెడ్డి తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావును కోరారు. ఆదిలాబాద్ జిల్లాలో ఈసారి శనగ పంట అధికంగా పండిందని రైతులకు ఎకరాకు ప్రభుత్వం కొనుగోలు చేసే పరిమితి 7 7.13 క్వింటాల నుంచి పది క్వింటాళ్ల వరకు పెంచి కొనుగోలు చేయాలని ఆయన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఒక లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు.



## సురంగల్‌లో ముస్లిం సోదరులతో ఇఫ్తార్ విందు..

**మొయినాబాద్ మహా:** రంజాన్ మాసం సందర్భంగా మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సురంగల్‌లో 14వ వార్డ్ కౌన్సిలర్ కర్రోల శ్రీధర్ ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ విందులో గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఐక్యతను చాటారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ శ్రీధర్ మాట్లాడుతూ, ఇఫ్తార్ అనేది సమానత్వానికి ప్రతీక అని, మహమ్మద్ ప్రవక్త అన్ని మతాలు, కులాలకు అతీతంగా అందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చే ఉద్దేశంతో ఈ సంప్రదాయాన్ని ప్రారంభించారని తెలిపారు. సమాజంలో ఐక్యత, సోదరభావం పెంపొందించడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గడ్డం అంజిరెడ్డి, సభ్యులు ఎండి షఫీ, ఎట్టయ్య గౌడ్, అశోక్ గౌడ్, ఎండి ఇస్మాయేల్, ఎండి మహబూబ్, సద్దాం, కర్రోల నర్సింగ్ రావు, ధనరాజ్, కన్నా, రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మా గాంధీ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ



**ఆమనగల్లు, మహా :** తలకొండపల్లి మండలం వెంకట్రావుపేట గ్రామపంచాయతీలో మహాత్మా గాంధీ విగ్రహ ఏర్పాటుకి గ్రామ సర్పంచ్ ఇమ్మడి మహేష్ భూమి పూజ చచేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాంధీ ఆలోచనలు ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమన్నారు.ఆయన చూపిన మార్గంలో నడవడం సమాజ అభివృద్ధికి ఎంతో అవసరమని పేర్కొన్నారు.ఈ విగ్రహం ఏర్పాటు ద్వారా గ్రామ యువతలో దేశభక్తి నైతిక విలువలు పెంపొందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పోలే ప్రశాంత్, మాజీ ఎంపీపీ లక్ష్మీదేవి రఘురాములు, మాజీ సర్పంచ్ కేంచ ఐమావతి రమేష్, గ్రామ పెద్దలు గౌరిగే వెంకటయ్య, కానుగుల వెంకటయ్య, పోలే ఎల్లయ్య, మోక్తాల వెంకటయ్య, బిద్దుల విష్ణు, వార్డు సభ్యులు గువ్వ శంకరయ్య ,చప్పిడి హుస్సేన్, తోట శ్రీనివాస్ యాదవ్ ,కానుగుల భాగ్యమ్మ వెంకటయ్య, మొత్తల సంతోషా రాజు, బొల్గమ్ యాదమ్మ (రాఘవేందర్), గౌర్ల లింగం, మరియు గ్రామ పెద్దలు ఇమిడి రాములు ,బోడా వెంకయ్య ,చప్పిడి చంద్రయ్య, పిప్పళ్ళ శివశంకర్ ,చప్పిడి రాములు, మహమ్మద్ జాంగిర్ ,బండ శ్రీశైలం, ఆగిరు శ్రీనివాసులు, యువకులు కళ్యాణ్కార్ రాజు ,కమటం ధనంజయ, మొకురాల ప్రకాష్ గౌడ్, ఇమ్మిడి ఆనంద్, గౌరిగే శివ, కానుగుల చంద్ర కుమార్, కళ్యాణ్ కార్ లక్ష్మోజి, ఇమ్మడి శ్రీశైలం, ఎదిరే నాగేష్ ,తైదా హరీష్ తదితరులు పాల్గొన్నారు



## ప్రజారంజక ప్రజా ప్రభుత్వ బడ్జెట్

### బడ్జెట్ లో అన్ని వర్గాలకు న్యాయం

### టీపీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్

**ఆమనగల్లు, మహా :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రవేశ పెట్టిన తెలంగాణ ప్రజా ప్రభుత్వం బడ్జెట్ 3లక్షల 24వేల కోట్ల బడ్జెట్ అన్ని వర్గాలకు, పేదలకు న్యాయం చేసే విధంగా ఉందని టీపీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి , బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహా ముదిరాజ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి నేనావత్ భీక్య నాయక్ కాంగ్రెస్ నాయకులతో కలిసి శ్రీనివాస్ గౌడ్ విలేకరులతో మాట్లాడుతూ ఇది ప్రజరంజక బడ్జెట్ అన్నారు.ముఖ్యంగా విద్యా, వైద్యం,వ్యవసాయం, యువత, విద్యుత్తు, మహిళల కు,పంచాయతీరాజ్ గ్రామీణ గ్రామీణ అభివృద్ధి, ప్రాజెక్టులకు,రవాణా శాఖకు,పురపాలక పట్టణాభివృద్ధికి, యువతకు, మహిళలకు,ఎంతో మేలు చేసే విధంగా ఉంది అని అయన అన్నారు అన్నారు. కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం ప్రజల పక్షాననే ఉంటుందని శ్రీనివాస్ గౌడ్ అన్నారు ఈ కార్యక్రమం కడ్తాల్ సర్పంచ్ రాయికంటి బిక్షపతి, మాజీ ఎంపీటీసీ సభ్యులు గురిగల్ల లక్ష్మయ్య,మాజీ కో ఆప్షన్ సభ్యులు జహంగీర్ బాబా,వార్డు సభ్యులు మంకి మహేష్,కిసాన్ సెల్ అధ్యక్షులు బాలరాజు,మంకి శ్రీను, మల్లయ్య, శ్రీశైలం పాల్గొన్నారు...

## నేత్రదానంతో మరణించినా జీవిస్తున్న ఆయిల్ల మల్లేష్

### నేత్రదానంతో ఇద్దరు అంధుల జీవితంలో వెలుగులు



**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామానికి చెందిన ఆయిల్ల మల్లేష్ (55 సం) గుండె పోటుతో మరణించగా వారి బావమరిది జనహిత సేవా సమితి సహాయ కార్యదర్శి గొడిసెల శేఖర్ వారి కుటుంబ సభ్యులకు నేత్రదానం గురించివివరించగా కుటుంబ సభ్యులు పుట్టెడు దుఃఖంలో ఉండి నేత్రదానం ద్వారా ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపాలని భావించి నేత్రదానం చేయడానికి ముందుకు రావడంతో సదాశయా ఫౌండేషన్ వారి సహకారంతో ఎల్ వి. ప్రసాద్ ఐబ్యాంక్ సిబ్బంది ప్రదీప్ నేత్రాలను స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్ మాట్లాడుతూ ఆయిల్ల మల్లేష్ కుటుంబ సభ్యులు సమాజహితం కోరి పుట్టెడు దుఃఖంలో ఉన్న భార్య ఆయిల్ల పద్మ, కుమారుడు సాయి తేజ, కుమార్తెలు ప్రీతి, ప్రియాంకలు నేత్ర దానం ద్వారా ఇద్దరి అందులకి చూపునివ్వాలని నేత్ర దానానికి ముందుకు రావడం అభినందనీయం అని జనహిత సేవా సమితి తరపున ఇది 13 వ నేత్రధాన కార్యక్రమని ఆయిల్ల మల్లేష్ కుటుంబ సభ్యుల స్ఫూర్తితో ప్రజలందరు మరణించిన తరువాత నేత్ర, అవయవ,శరీరాలు కాల్చి బూడిద అయి వృధా కాకుండా దానం చేసి సమాజానికి ఉపయోగపడాలని నేత్రదానం చేసినపుడు మరణించిన తరువాత ఎనిమిది గంటల లోపు మరణించిన వ్యక్తి యొక్క కళ్లలోని కార్నియా పొరని మాత్రమే సేకరిస్తారని నేత్ర దానం ద్వారా ఇద్దరు అంధులకి చూపు ప్రసాదించి వారి ద్వారా మరణించిన ఈ ప్రపంచాన్ని చూసే అవకాశం ఉందని ఈ అవకాశాన్ని ప్రజలందరూ చేపట్టాల్సిన అవసరం ఉందని ఆకాంక్షించారు. వ్యక్తి బ్రెయిన్ డెడ్ అయినప్పుడు వారి అవయవాలు దానం చేయడం వల్ల ప్రాణాపాయ స్థితిలో అవయవాలు అవసరం ఉన్న ఎనిమిది మంది ప్రాణాలు కాపాడే అవకాశం ఉందని అలాగే శరీర అవయవ దానం ద్వారా పార్థివ దేహాన్ని వైద్య కళాశాల కి అందించి కొన్ని వేల వైద్య విద్యార్థుల బోధనకు ఉపయోగపడి ప్రజల వైద్య చికిత్స కి ఉపయోగపడే అవకాశం ఉందని ప్రజలందరూ అపోహాలు వీడి నేత్ర,అవయవ,శరీర దానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. నేత్రదానం అనంతరం కుటుంబ సభ్యులకు ఎల్.వి ప్రసాద్ ఐబ్యాంక్ వారి నేత్ర దాన సర్టిఫికెట్ ని వారి కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు నాతరి మూర్తి,జనహిత సేవా సమితి ప్రధాన కార్యదర్శి ఇప్ప రవి,సహాయ కార్యదర్శి గొడిసెల శేఖర్, గుమ్ముల చందు కార్యవర్గ సభ్యులు భీమిని కనకయ్య మరియు కుటుంబ సభ్యులు బంధు మిత్రులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు



## గ్రామాల్లోనే సేవలు అందించాలి

### కౌన్సిలర్ కర్రోల శ్రీధర్

### గ్రామ పాలన అధికారులను గ్రామాలకు పంపించాలని వినతి

**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మున్సిపాలిటీ 14వ వార్డు కౌన్సిలర్ కర్రోల శ్రీధర్ గ్రామ పాలన అధికారులను గ్రామాల్లోకి పంపించాలని కోరుతూ తాసిల్దార్ గౌతమ్ కుమార్ కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ శ్రీధర్ మాట్లాడుతూ, ప్రస్తుతం గ్రామ పాలన అధికారులు రెవెన్యూ కార్యాలయాల వద్దే ఉండి పనులు నిర్వహిస్తున్నారని, దీనివల్ల గ్రామాల్లోని సాధారణ ప్రజలు చిన్న చిన్న భూ సమస్యలు, కులంఆదాయం సర్టిఫికెట్లు వంటి పనుల కోసం తప్పనిసరిగా తాసిల్దార్ కార్యాలయానికి రావాల్సి వస్తోందని తెలిపారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్తులకు సులభంగా సేవలు అందేలా గ్రామ పాలన అధికారులు వారానికి కనీసం మూడు రోజులు గ్రామాల్లో ఉండి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని ఆయన కోరారు.ఈ విషయంపై స్పందించిన తాసిల్దార్ గౌతమ్ కుమార్, పదవ తరగతి పరీక్షలు పూర్తైన వెంటనే గ్రామ పాలన అధికారులను గ్రామాల్లోకి పంపిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తిమ్మగల చంద్రశేఖర్, ఎర్రోళ్ల రామచందర్, ఎలుగని లోకేష్ గౌడ్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నీటిని పొదుపుగా వాడుకుందాం

### బాకారం సర్పంచ్ ఎల్గని వెంకటేష్ గౌడ్



**మొయినాబాద్ మహా:** వేసవిదృశ్యా నీటిని పొదుపుగా వాడుకోవాలని అనవసరంగా నీటిని వృథా చేయవద్దని బాకారం జాగీర్ గ్రామప్రజలకు అ గ్రామ సర్పంచ్ ఎల్గని వెంకటేష్ గౌడ్ సూచించారు. ఎందుకంటే నీటి ఎద్దడి రాకుండా ముందుస్తుచర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలు నీటిని వృథా చేయవద్దని సూచించారు. అనవరసంగా నీటిని ఉపయోగించడం ద్వారా అండర్ డ్రైనేజ్ మురుగు కాలువలు పొంగిపొర్లుతున్నాయని తెలిపారు. దీంతో గ్రామంలో ఇబ్బందికరపరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. వేసవికాలం దృష్టిలో పెట్టుకొని నీటి ఎద్దడిరాకుండా ఇప్పటి నుంచే చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తోసరానికి మించిత్రాగు నీటిని ఉపయోగిం చుకోవాలని.. ఇనుసారంగా నీరును రోడ్లపైకి వచ్చే విధంగా చేసే ఇంటియజమానులకు గ్రామపంచాయతీ తరపున జరిమాన విధించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. గ్రామాభివృద్ధిలో అందరూ బాగస్వామ్యులు కావాలని కోరారు. గ్రామపరి పాలనకు అందరూ సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుబాష్ చంద్రాబోస్ రెడ్డి, పంచాయ తీ కార్యదర్శి శివశంకర్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

## ఈటల రాజేందర్ జన్మదిన వేడుకల్లో బిజెపి నాయకులు తోకల



**రాజేంద్రనగర్ మహా ;** రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి, నియోజకవర్గంలోని బిజెపి పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలతో కలిసి బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు మాల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ను శుక్రవారం అయిన నివసంలో కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవుణ్ణి చల్లని ఆశీస్సులు దీవెనలతో ఆయన జీవితాంతం ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలన్నారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు.

## ప్రజా కళాకారుడు సబ్బని కృష్ణకు కళారత్న నేషనల్ అవార్డు ప్రధానం



**బెల్లంపల్లి,మహా :** బెల్లంపల్లి పట్టణానికి చెందిన ప్రజా కళాకారుడు సబ్బని కృష్ణ కు బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో తిరుపతి వేదికగా కళా రత్న నేషనల్ అవార్డును ప్రధానంచేయడం జరిగింది. 46 సంవత్సరాల కళామతల్లి సేవకు గుర్తింపుగా ప్రజకళాకారుడు సబ్బని కృష్ణ తన గానంతో ఎంతోమందిని ఆకట్టుకొని ప్రశంసలు పొందడం జరిగింది.ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రజానాట్య మండలి జిల్లాకార్యదర్శిగా,రాష్ట్రఅధ్యక్షుడుగా,గౌరవఅధ్యక్షుడుగా,రచయితగా,గాయకుడిగా,దర్శకుడిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో పాటు తమిళనాడు, మహారాష్ట్ర, బిహార్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ తదితర రాష్ట్రాలలో కూడా వేలాది నాటికలను,నాటకాలను,నృత్యనాటికలను,వీధి నాటికలను, ఒగ్గు కథలను, వేలాది ప్రదర్శనలు చేస్తూ ప్రజల భాష,ప్రజల బాణీలు తీసుకొని వాటికి ప్రజల కష్టాలను జోడించి పాలకుల విధానాలను ఎండగట్టే పాటలు అల్లి ప్రజల్లోచైతన్యాన్ని రేకెత్తించారు.విప్లవ భావ జాలంమెండుగా ఉన్న,బహుముఖ ప్రజ్ఞాశాలి,ప్రజానాయకుడు, ఎం సి పి ఐ యు పార్టీ మాజీ కేంద్ర నాయకుడీగి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోని అన్ని వర్గాల ప్రజలకు, కళాకారులకు సుపరిచితులు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ప్రజలకు కళాకారులకు కామ్రేడ్ సబ్బని కృష్ణను బహుజన సాహిత్య అకాడమీ నేషనల్ ప్రెసిడెంట్ నల్ల రాధాకృష్ణ ఈనెల 15వ తేదీ ఆంధ్ర ప్రదేశ్ లోని తిరుపతి నగరంలో జరిగిన బహుజన రైటర్స్ 18వ సౌత్ ఇండియా కాన్ఫరెన్స్లో *కళారత్న నేషనల్ అవార్డు* ను ప్రధానం చేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బి.ఎస్.ఎ నేషనల్ జనరల్ సెక్రటరీ డా.యు. సుబ్రహ్మణ్యన్,జి.విష్ణువర్ధన్ బి.ఎస్.ఎ సౌత్ ఇండియా జనరల్ సెక్రెటరీ జీ విష్ణువర్ధన్,,కాన్ఫరెన్స్ కన్వీనర్ మరియు ఏడు రాష్ట్రాలకు చెందిన కవులు కళాకారులు,రచయితలు గాయకులు,మేధావులు, అవార్డు గ్రహీతలు తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి కళారత్న నేషనల్ అవార్డు అందుకున్న సబ్బని కృష్ణను కవులు,కళాకారులు, మేధావులు,అన్నివర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేసి అభినందించారు.

## పాడి పశువులలో అధిక పాల ఉత్పత్తి, పునరావత్పత్తి

### సామర్థ్యం పోషణ పై మెలకువలను వివరించిన డాక్టర్ డి నాగలక్ష్మి




**రాజేంద్రనగర్ మహా ;** పివి నరసింహారావు తెలంగాణ, పశువైద్య విశ్వవిద్యాలయంలో పశు పోషణ విభాగం, ఐ సిఏ ఆర్ జాతీయ మాంస పరిశోధన ఆధ్వర్యంలో షెడ్యూల్ కులాల యువతకు పాడి పశువులలో అధిక పాల ఉత్పత్తి, పునరుత్పత్తి సామర్థ్యం పోషణలో మెళకువల పై ఒక్క రోజు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. పశువుల ఉత్పాదకతను పెంచడంలో సరైన సమతుల్య ఆహారం యొక్క ప్రాముఖ్యతను పోషణ విభాగం అధిపతి డా,డి నాగలక్ష్మి వివరించారు. ముఖ్యంగా పాడి పశువులకు అవసరమైన ఖనిజ లవణాలు, విటమిన్లు, నాణ్యమైన మేత అందించడం ద్వారా పాల దిగుబడిని పెంచడమే కాకుండా, వాటి పునరుత్పత్తి సామర్థ్యాన్ని ఎలా మెరుగుపరచుకోవచ్చో శాస్త్రీయంగా వివరించారు. పశుపోషకులు ఆధునిక పోషణ పద్ధతులను అవలంబించడం ద్వారా అధిక లాభాలను పొందవచ్చని ఈ సందర్భంగా సూచించారు.ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధ్యాపకులు డా ఎన్ నళినికుమారి, డా జె నరసింహ, డా అలెగ్జాండర్, డా ఏ సుధీర్ బాబు, డా రామకృష్ణ, వివిధ జిల్లాలకు చెందిన రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అల్విదా జుమ్మా

**ఆమనగల్లు, మహా :** రంజాన్ మాసం జుమ్మతుల విదా (చివరి శుక్రవారం) నమాజును ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలంలో ముస్లింలు భక్తి శ్రద్ధలతో చేశారు. మండలం, గ్రామాల్లోని ముస్లింలు ఆల్ విదా జుమ్మా ప్రత్యేక నమాజుతో మసీదులు కిటకిటలాడాయి. మసీదుల్లో ఇమామ్ లు నమాజు చేయించడంతో పాటు దువా కార్యక్రమం చేశారు. పేదలను ఆదుకోవాలని, వారి కష్టసుఖాల్లో పాలుపంచుకోవాలన్నారు. ప్రజలందరూ సుఖశాంతులతో గడపాలని దైవాన్ని ప్రార్థించారు. పట్టణంలోని జామియా మసీదు, మహమ్మదీయ మసీదు, హమదే హిలాల్ మసీదు తదితర మసీదుల్లో జరిగిన సామూహిక శుక్రవారం ప్రార్థనల్లో ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పవిత్ర ఖురాన్ పఠనం కొనసాగింది..

## విద్యాలయ భవన నిర్మాణ పనులను త్వరగతిన పూర్తి చేయాలి

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, మహా :** విద్యాలయ భవన నిర్మాణ పనులను త్వరగతిన పూర్తి చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం నెన్నెల మండల కేంద్రంలో కొనసాగుతున్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం అకాడమిక్ బ్లాక్ నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అనేక కార్యక్రమాలు చేపడుతుందని చెప్పారు. ఈ క్రమంలో పాఠశాల అకాడమిక్ బ్లాక్ నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులు,సిబ్బంది, విద్యార్థుల హాజరు పట్టికలు, తరగతి గదులు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ సబ్జెక్టులలో ప్రశ్నలు అడిగి వారి అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం, శుద్ధమైన త్రాగునీటితో పాటు నాణ్యమైన విద్య బోధన అందించాలని, పాఠశాలలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. గ్రామంలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, మురుగు కాలువల వ్యవస్థ, పారిశుధ్యం సక్రమంగా నిర్వహించాలని వెల్లడించారు. మండల కేంద్రంలోని నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్ లను సందర్శించి మొక్కలు నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, సకాలంలో నీటిని అందించి మొక్కలను పరిరక్షించాలని తెలిపారు. ప్రతిరోజు ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్తలను వేరువేరుగా సేకరించి డంపింగ్ యార్డ్ కు తరలించాలని, ఉపయోగకరమైన చెత్తను వేరుచేసి సెగ్రికేషన్ షెడ్లకు తరలించాలని తెలిపారు. ఈ అంశాల సమర్థవంతమైన నిర్వహణపై నిర్వాహకులను అభినందించారు. మండలంలోని చిత్తాపూర్ గ్రామంలో గల ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు సకాలంలో పౌష్టికాహారం అందిస్తూ నాణ్యమైన విద్య బోధన చేయాలని, విద్యార్థుల ఆరోగ్య పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. విద్యార్థులతో మాట్లాడుతూ సబ్జెక్టులలో ప్రశ్నలు అడిగి, మధ్యాహ్న భోజనం నాణ్యత, సౌకర్యాల కల్పన అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏకాగ్రతతో చదివి వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించాలని, ఉన్నత స్థాయికి ఎదిగే దిశగా ఏకాగ్రతతో కృషి చేయాలని తెలిపారు. మధ్యాహ్న భోజనం తయారీ తీరును పరిశీలించి సిబ్బంది శుభ్రత నిబంధనలు పాటించాలని, ఆహారం తయారీలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యావసర సరుకులు వినియోగించాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించే విధంగా ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయుల సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. అనంతరం మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల పఠన సామర్థ్యాన్ని పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి మొహమ్మద్ అబ్దుల్ హై, మండల పంచాయతీ అధికారి, పంచాయితీ కార్యదర్శి, సర్పంచ్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తుంది

- ఈనెల 23న చలో కలెక్టరేట్ పాదయాత్ర
- ఉపాధి కూలీల బిల్లులు వెంటనే చెల్లించాలి
- యాచారం సిపిఎం మండల పార్టీ నాయకులు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఈనెల 23 చేపట్టనున్న పాదయాత్రను విజయవంతం చేయాలని, సిపిఎం పార్టీ మంతన్ గౌరెల్లి గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఉపాధిహామీ కూలీలను కోరారు. యాచారం మండలం మంతన్ గౌరెల్లి గ్రామంలో భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీన ఇబ్రహీంపట్నం నుండి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు నిర్వహించే పాదయాత్రను జయప్రదం చేయాలని, ఉపాధి హామీ పని ప్రదేశాన్ని పర్యటించి ప్రజలను కోరారు. అనంతరం ఉపాధి హామీ కూలీల సమస్యలు అడిగి తెలుసుకొని వాళ్ళ యొక్క సమస్యల పరిష్కారాన్ని కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ చందు నాయక్, సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు మాజీ ఎంపిటిసి కేతావునాయక్ నాయక్, ఉపాధి హామీ కూలీలను ఉద్దేశించి మాట్లాడుతూ... 6, 7 వారాలైన ఉపాధి హామీ బిల్లులు చెల్లించకుంటే కూలీలు ఎలా బ్రతికేది అని వారు ఆందోళన వ్యక్తం చేశారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని అన్నారు. గత 6,7 వారాలుగా బిల్లులు చెల్లించకుంటే పేద ప్రజలకు జీవనం ఎలా అని ప్రశ్నించారు. ఎర్రటి ఎండలోపనిచేస్తున్న కూలీలు నేటికీ డబ్బులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పని ప్రదేశాల్లో మంచినీటి సౌకర్యం, టెంటు, మెడికల్ కిట్టు తదితర వసతులు కల్పించాలని అన్నారు. ఉపాధి హామీ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 23న ఇబ్రహీంపట్నం నుండి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు పాదయాత్ర ఉంటుంది కావున పాదయాత్రలో ఉపాధి కూలీలంతా అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి పెండింగ్ లో ఉన్న ఉపాధి కూలీల బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి కందుల శ్రీరాములు, పార్టీనాయకులు బట్టు జంగయ్య, ఎస్ భాస్కర్ నాయక్, కే కుమార్, ఎస్ పంతు నాయక్, గోపాల్, రవికుమార్ ఉపాధి హామీ కూలీలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి
# కుటుంబంలో విషాదం



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** కరెంట్ షాక్‌కు గురై వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం యాచారం మండల పరిధిలోని, నజ్దిక్ సింగారం గ్రామంలో చోటు చేసుకుంది. దీంతో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పునమూర్తి అంజయ్య(50) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే వ్యవసాయ పొలం వద్దకు వెళ్ళగా గురువారం రాత్రి కురిసిన వర్షానికి బోరు మోటర్ పనిచేయకపోవడంతో సాటర్ డబ్బా వద్ద మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ ప్రసరణ జరిగి షాక్ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి కుటుంబంలో గ్రామంలో విషాద ఛాయలు చోటు చేసుకున్నాయి. సంబంధిత అధికారులు మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# కులం గడప లోపలే బయట మనమంతా హిందువులం..

**నల్లగొండలో హిందూ సమ్మేళన ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ.. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల వేళ ఐక్యతకు పిలుపు..**



**నల్లగొండ, మహా :** "కులం అనేది గడప లోపల మాత్రమే ఉండాలి.. బయటకు వస్తే మనమంతా హిందువులమే అనే భావన ప్రతి ఒక్కరిలో కలగాలి" అని ఆర్ఎస్ఎస్ విభాగ్ సహసంఘ చాలక్ ఇటిక్యాల కృష్ణయ్య పిలుపునిచ్చారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (RSS) వంద సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న హిందూ సమ్మేళనాలపై శుక్రవారం నల్లగొండలోని గాంధీనగర్ హనుమాన్ దేవాలయంలో కమిటీ సభ్యులతో కలిసి ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సమ్మేళన ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ..ప్రస్తుత పరిస్థితుల్లో హిందూ సమాజం ఐక్యంగా ఉండటం అత్యవసరమని పేర్కొన్నారు. సమాజంలో హిందువులపై, దేవాలయాలపై జరుగుతున్న దాడులను అరికట్టడానికి సంఘటిత శక్తి ఒక్కటే మార్గమని స్పష్టం చేశారు. ఆర్ఎస్ఎస్ వందేళ్ల ప్రస్థానంలో ఇప్పటివరకు 10 కోట్ల మందిని ఐక్యం చేయగలిగామని వెల్లడించారు. నల్లగొండలోని శివాజీ పార్క్‌లో నిర్వహించనున్న భారీ హిందూ సమ్మేళనానికి సర్వం సిద్ధం చేస్తున్నామని ఈ కార్యక్రమానికి శ్రీశైలం శ్రీ సిద్ధ ఆశ్రమ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ శ్రీనివాసానంద స్వామి మహారాజ్ హాజరవుతారని తెలిపారు. ఈ ధర్మ ప్రచార సమ్మేళనంలో ప్రతి హిందూ కుటుంబం తమ ఇంటి సభ్యులతో కలిసి పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. హిందూ ధర్మ రక్షణే ధ్యేయంగా సాగే ఈ సమ్మేళనం చారిత్రాత్మక ఘట్టంగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో హిందూ సమ్మేళనం కమిటీ అధ్యక్షుడు బెల్లి నాగరాజు, ఉపాధ్యక్షులు వారణాసి రజనీకాంత్ శర్మ, మందడి పుష్పలత, పెద్దిరెడ్డి మనోజ, జగిని శరత్ బాబు, బొడ్డు తిరుపతయ్య, మల్లెబోయిన సతీష్, సంకటి వీరేష్, పిల్లి కృష్ణ, తేలు సైదులు, తోగోటి రమేష్, గుంటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# బడ్జెట్‌పై సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అసంతృప్తి.!

- ప్రజలు ఆశించినట్లుగా లేని బడ్జెట్..
- వృత్తి సంఘాలను విస్మరించిన ప్రభుత్వం..




**నల్గొండ, మహా :** రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 202627 వార్షిక బడ్జెట్ పట్ల సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇది కేవలం ఒక 'మిశ్రమ బడ్జెట్' అని ఇందులో సామాన్య ప్రజలకు ఆశించిన ప్రయోజనాలు ఏవీ లేవని ఆయన విమర్శించారు. ఈ బడ్జెట్ ప్రసంగాలకే పరిమితం కాకుండా, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి తోడ్పడేలా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ముఖ్యంగా ఎన్నికల హామీ మేరకు పెన్షన్లను రెట్టింపు చేస్తారని వృద్ధులు, పేదలు ఆశించారని అయితే బడ్జెట్‌లో ఆ దిశగా ఎలాంటి ప్రకటన లేకపోవడం నిరాశ కలిగించిందని పేర్కొన్నారు. సమాజంలో కీలకమైన గీత కార్మికులు, యాదవులు, ముదిరాజులు, చేనేత కార్మికులు వంటి వివిధ వృత్తి సంఘాల సంక్షేమానికి సంబంధించి బడ్జెట్‌లో కనీస ప్రస్తావన లేకపోవడం శోచనీయమన్నారు. కుల వృత్తులపై ఆధారపడి బతుకుతున్న వారిని ప్రభుత్వం విస్మరించిందని మండిపడ్డారు. విద్యా రంగానికి తాము 20 శాతం నిధులు డిమాండ్ చేస్తుంటే ప్రభుత్వం కేవలం 8 శాతం నిధులతోనే సరిపెట్టిందని అలాగే ఆరోగ్య రంగానికి కేవలం 4 శాతం మాత్రమే కేటాయించడం ప్రజారోగ్యం పట్ల ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్యాన్ని సూచిస్తోందని విమర్శించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలోనూ నైపుణ్యాభివృద్ధిలోనూ ఈ బడ్జెట్ ఎలాంటి దిశానిర్దేశం చేయలేకపోయిందని ఎత్తి చూపారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీపై ఎటువంటి స్పష్టత లేకపోవడం నిరుద్యోగులను ఆందోళనకు గురిచేస్తోందని అన్నారు.కొత్తగా ప్రకటించిన ఇందిరమ్మ బీమా పథకం కింద ప్రతి కుటుంబానికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వడాన్ని ప్రస్తావిస్తూనే కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో ఖర్చు చేసేలా పారదర్శకమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బడ్జెట్ కేటాయింపులు కేవలం అంకెలకు పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలు కావాలని సిపిఐ పార్టీ తరఫున ఆయన కోరారు.



## 25న పోలీస్ వాహన విడిభాగాల
# బహిరంగ వేలం

**ఎస్పీ శరత్ చంద్ర పవార్ వెల్లడి..**

**నల్గొండ, మహా :** జిల్లా పోలీస్ కార్యాలయంలోని మోటర్ ట్రాన్స్‌పోర్ట్ (ఎం.టి) విభాగానికి చెందిన పాత టైర్లు, బ్యాటరీలు, ఇతర ఇనుప విడిభాగాలకు ఈ నెల 25వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటలకు జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో ఈ వేలం ప్రక్రియ ప్రారంభం కానుంది. పోలీస్ వాహనాలకు సంబంధించి కాలం చెల్లిన ఉపయోగించని వివిధ రకాల పాత టైర్లు, పాత బ్యాటరీలు, ఆయిల్ డ్రమ్ములు, ఇనుప స్పేర్ పార్ట్స్ తదితర వస్తువులను ఈ సందర్భంగా వేలం వేయనున్నారు. ఆసక్తి కలిగిన వారు నిర్ణీత సమయానికి జిల్లా పోలీస్ కార్యాలయానికి హాజరై వేలంలో పాల్గొనవచ్చని ఎస్పీ సూచించారు.ఈ వేలం ప్రక్రియకు సంబంధించిన ఇతర పూర్తి వివరాల కోసం మోటర్ ట్రాన్స్‌పోర్ట్ ఇన్‌స్పెక్టర్ (RI) శ్రీ సూరపు నాయుడు గారిని సంప్రదించాలని ఆయన కోరారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అత్యధిక ధర పలికిన వారికే ఈ వస్తువులను కేటాయించడం జరుగుతుందని స్పష్టం చేశారు.

# ప్రజా పాలనా లేక రాక్షస పాలనా!



- ఆశ వర్కర్ల గర్జన 'ఇందిరా భవన్' ముట్టడికి యత్నం..
- కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని డిమాండ్..
- దొడ్డి కొమరయ్య భవన్ నుంచి భారీ ర్యాలీ..

**నల్లగొండ టౌన్, మహా :** తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆశా వర్కర్లు శుక్రవారం నల్లగొండ పట్టణంలో గర్జించారు. తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో మంత్రుల కార్యాలయాల ముట్టడికి యత్నించారు. తొలుత పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవన్ నుంచి పెదగడియారం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇందిరా భవన్‌ను ముట్టడించేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగి ఉద్రిక్తత చోటుచేసుకుంది. చివరకు పోలీసులు జోక్యం చేసుకుని ఆర్డీఓ అశోక్ రెడ్డిని అక్కడికి పిలిపించగా, ఆశాలు ఆయనకు వినతిపత్రం సమర్పించారు.

**హామీలు అమలు చేయాలి సీఐటీయూ..**

ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండి సలీం మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం ఆశా వర్కర్లకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లోనే ఇందుకోసం నిధులు కేటాయించాలని కోరారు. గత మూడు నెలలుగా పారితోషికాలు రాక ఆశాలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పని ఒత్తిడి పెంచి వారిని మానసిక వేదనకు గురిచేస్తున్నారని, ఆరోగ్య శాఖకు సంబంధం లేని పనులు చేయించవద్దని కోరారు. పారితోషికాల విధానాన్ని రద్దు చేసి ఎన్‌హెచ్ఎం స్కీంకు బడ్జెట్‌లో నిధులు పెంచాలని స్పష్టం చేశారు. మంత్రుల కార్యాలయాల ముట్టడిని భగ్నం చేసేందుకు పోలీసులు తెల్లవారుజాము నుంచే మహిళలని చూడకుండా అక్రమ అరెస్టులకు పాల్పడటాన్ని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దండెంపల్లి సత్తయ్య ఖండించారు. జిల్లావ్యాప్తంగా 22 పోలీస్ స్టేషన్లలో సుమారు 400 మందిని ముందస్తుగా అరెస్టు చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. 'ప్రజా పాలన' అని చెప్పుకుంటూ రాక్షస పాలన సాగిస్తున్నారని విమర్శించారు.ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహేశ్వరి, తవిటి వెంకటమ్మ, నాయకులు లేకపాక రాజు, పెంజర్ల సైదులు, ఏదుళ్ళ సునీత, ఆదిమల్ల సుధీర్, అనురాధ, సైదమ్మ, రేణుక, నవనీత తదితరులు పాల్గొన్నారు.



## గోల్డ్ మెడల్ సాధించిన
# సహస్రకు సన్మానం

**మహా : సంగారెడ్డి ప్రతినిధి :** కేలో ఇండియా లో గోల్డ్ మెడల్ సాధించిన నంది గారి సహస్ర కి తెలంగాణ దీప దీప నైవేద్య రాష్ట్ర కార్యదర్శి, మన సమాజం వ్యవస్థాపకులు శ్రీ మహేష్‌స్వామి సత్కరించి ఆశీర్వదించారు.నందిగారి సహస్ర ఇలాంటి ఎన్నో విజయాలు సాధించి మన ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆదిదంపతులైన ఆ పార్వతీ పరమేశ్వరుల కోరుకున్నారువారికి ప్రోత్సహించిన తల్లిదండ్రులకు మరియు కోచింగ్ ఇచ్చినటువంటి కోచర్స్ కి అభినందించాలి ఈ కార్యక్రమం లో సంజీవిని హనుమాన్ దేవస్థానం ప్రధాన పూజారి శ్రీ చంద్రశేఖర్ స్వామి వీరశైవ సమాజం శ్రీకృష్ణ నగర్ కాలనీ ఉపాధ్యక్షుడు మన పల్లి మధు మరియు సమాజం పెద్దలు పాల్గొన్నారు

# బడ్జెట్‌లో బీసీలకు తీరని అన్యాయం..

- జనాభాలో 56 శాతం ఉన్నా నిధులు 3.4 శాతమేనా?
- రాష్ట్ర ప్రభుత్వంపై బీసీ యువజన సంఘం నేత దీపెందర్ ధ్వజం..



**నల్లగొండ టౌన్, మహా :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 202627 వార్షిక బడ్జెట్ బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉందని బీసీ యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బీసీ యూత్ జేఏసీ చైర్మన్ కట్టెకోలు దీపెందర్ విమర్శించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర జనాభాలో 56 శాతానికి పైగా ఉన్న బీసీలకు కేవలం 3.4 శాతం నిధులు కేటాయించడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రూ. 3.24 లక్షల కోట్ల భారీ బడ్జెట్‌లో బీసీలకు కేవలం రూ. 12,511 కోట్లు మాత్రమే కేటాయించి ప్రభుత్వం వారి గొంతు కోసిందని మండిపడ్డారు.

**పాత చింతకాయ పచ్చడి చందంగా..**

గత ఏడాది స్పష్టమైన లెక్కలు లేవనే సాకుతో తక్కువ నిధులు ఇచ్చారని ఇప్పుడు లెక్కలు తేలిన తర్వాత కూడా 'కొత్త సీసాలో పాత చింతకాయ పచ్చడి' అన్న చందంగా బడ్జెట్ ఉందని ఎద్దేవా చేశారు. జనాభా ప్రాతిపదికన నిధులు వస్తాయని ఆశించిన బీసీలకు ఈ కేటాయింపులు తీవ్ర నిరాశను మిగిల్చాయన్నారు. పన్నులు కట్టేది, సంపద సృష్టించేది బీసీలైతే ఆ సంపద మాత్రం అగ్రవర్ణాలకే చేరుతోందని ఆరోపించారు. ఈ అరకొర నిధులు రెండున్నర కోట్ల బీసీ జనాభాకు పంచితే కనీసం చాక్లెట్లు బిస్కెట్లు కూడా రావని విమర్శించారు.

**బీసీ సబ్ ప్లాన్ అమలు చేయాలి..**

గ్లోబలైజేషన్ కారణంగా కులవృత్తులు దెబ్బతిని బీసీలు రోడ్డున పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి బీసీలకు రూ. 40 వేల కోట్లు కేటాయించాలని దీపెందర్ డిమాండ్ చేశారు. అలాగే రూ. 30 వేల కోట్లతో 'బీసీ సబ్ ప్లాన్' ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని కోరారు. స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు పెంచుతామని చెప్పి ఉన్నవి తగ్గించి బీసీలకు అన్యాయం చేశారని ధ్వజమెత్తారు.ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ యలిజాల వెంకటేశ్వర్లు, నియోజకవర్గ అధ్యక్షుడు బోల్ల నాగరాజు, నాయకులు శేరి రవీందర్, జక్కలి సాయి, కంబాలపల్లి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా పాలన బడ్జెట్

**అమ్రాది రాజు**

**మహా :సదాశివపేట :**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన బడ్జెట్ ప్రజా బడ్జెట్ అని కాంగ్రెస్ పార్టీ అంటేనే ప్రజల బాగు కొరకు ఆలోచించే ప్రభుత్వం అని మరోసారి నిజమైందని సదాశివపేట మండల ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులు అమ్రాడి రాజు అన్నారు మొత్తం రూ. 3,24,234 కోట్ల బడ్జెట్ పెడితే ముఖ్యంగా విద్య శాఖకి : రూ. 26,674 కోట్లు,ఆరోగ్య శాఖ 13679 కోట్లు, ఎస్సి సంక్షేమం కొరకు 11784 కోట్లతో పాటు అన్ని శాఖలకు సరిపడా బడ్జెట్ కేటాయించారు దాంట్లో రాజీవ్ యువ వికాసం కొరకు 6000 కోట్లు కేటాయించడం యువతకి సంతోషాన్ని, ధైర్యాన్ని ఇచ్చింది అన్నారు, కాబట్టి అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వం అంటారని ఈ బడ్జెట్ తో రాష్ట్రం లో అన్ని విభాగాలకు చెందిన ప్రజలు చాలా సంతోషిస్తున్నారని తెలియజేస్తూ భారీ బడ్జెట్ ప్రవేశపెట్టిన రాష్ట్ర ప్రభుత్వానికి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు

## స్వగ్రామంలో రామలింగేశ్వరుడి
# చెంతకు కేసీఆర్

**సిద్దిపేట,మహా:** తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, భారత రాష్ట్ర సమితి అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు తన స్వగ్రామమైన సిద్దిపేట జిల్లా చింతమడకపై ఉన్న మమకారాన్ని మరోసారి చాటుకోనున్నారు. చింతమడక గ్రామంలోని అత్యంత పురాతనమైన, మహిమాన్వితమైన శ్రీ పట్టాభి సీతారామచంద్ర స్వామి ఆలయంలో ఈ నెల 25, 27వ తేదీల్లో నిర్వహించనున్న నూతన ధ్వజస్తంభ ప్రతిష్టాపన మరియు శ్రీరామ నవమి మహోత్సవాలకు కేసీఆర్ హాజరుకానున్నారు. ఈ మేరకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్వకుంట్ల వంశీధర్ రావు నేతృత్వంలో ఆలయ కమిటీ ప్రతినిధులు శుక్రవారం ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసానికి చేరుకుని, ఆయనను అధికారికంగా ఆహ్వానించారు. ఈ భేటీలో ఆలయ కమిటీ సభ్యులు ఆకుల రామ గౌడ్, పెండల గణేష్, బైరి నర్సింహా రెడ్డి, వాతం శివ, పడకండి విశ్వనాథం, ఎల్లప్పగారి పోచయ్య తదితరులు పాల్గొని కేసీఆర్‌కు ఆహ్వాన పత్రికను అందజేసి, ఉత్సవాల ఏర్పాట్లను వివరించారు. చింతమడక గ్రామంతో కేసీఆర్‌కు ఉన్న అనుబంధం కేవలం పుట్టిన గడ్డగానే కాకుండా, భావోద్వేగపూరితమైనది. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనూ ఆయన తన గ్రామాన్ని దర్శించి గ్రామస్తులతో మమేకమైన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఇప్పుడు గ్రామంలో అత్యంత భక్తిశ్రద్ధలతో జరుగుతున్న ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమానికి ఆయన రాక కోసం గ్రామస్తులు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. ఈ ఉత్సవాలు గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపడమే కాకుండా, రాజకీయాలకు అతీతంగా గ్రామ ప్రజలందరినీ ఏకతాటిపైకి తీసుకువస్తున్నాయి. కేసీఆర్ చేతుల మీదుగా లేదా ఆయన సమక్షంలో ఈ కార్యక్రమాలు జరగడం గ్రామస్తులకు ఒక ప్రత్యేక అనుభూతిని ఇస్తుంది. ఆలయ కమిటీ ప్రతినిధులు ఎంతో భక్తితో ఆహ్వానించిన నేపథ్యంలో, కేసీఆర్ కూడా సానుకూలంగా స్పందించి ఉత్సవాలకు హాజరయ్యేందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

# తెలంగాణ విద్యారంగంలో రేవంత్ విప్లవం

- ఇకపై టెన్త్ బోర్డు పరీక్షలు రద్దు?
- నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఒకే గొడుగు కిందకు.. సీఎం రేవంత్ రెడ్డి సాహసోపేత నిర్ణయం.
- విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేలా నయా విద్యా విధానం.
- కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా సర్కారీ విద్య
- తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌తో విద్యా వ్యవస్థలో సరికొత్త అధ్యాయం!

**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్రంలోని విద్యా వ్యవస్థను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక అడుగులు వేస్తున్నారు. కేవలం సంక్షేమ పథకాల ద్వారా కాకుండా, నాణ్యమైన విద్య ద్వారానే పేదరికాన్ని పారద్రోలవచ్చని గట్టిగా నమ్ముతున్న సీఎం, రాష్ట్రంలో విద్యా సంస్కరణలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా పది మరియు ఇంటర్మీడియట్ విద్యా విధానంలో భారీ మార్పులను ఆయన ప్రతిపాదించారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న పదవ తరగతి బోర్డు పరీక్షల విధానాన్ని రద్దు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గించి, వారిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు ఈ నిర్ణయం తీసుకోబోతున్నట్లు సమాచారం. బోర్డు పరీక్షల వల్ల విద్యార్థులు ఎదుర్కొంటున్న మానసిక ఆందోళనను తొలగించి, వారిని సృజనాత్మకత వైపు మళ్లించడమే ఈ సంస్కరణ ప్రధాన ఉద్దేశ్యం.వచ్చే విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఒకే రకమైన విద్యా విధానాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. దీని ప్రకారం, ప్రస్తుతమున్న 10+2 విధానానికి బదులుగా, పాఠశాల స్థాయిలోనే ఇంటర్మీడియట్ విద్యను కూడా విలీనం చేసే అవకాశం ఉంది. ఇందుకోసం 'తెలంగాణ పబ్లిక్ స్కూల్స్' పేరుతో అత్యాధునిక పాఠశాలలను ప్రభుత్వం ఏర్పాటు చేయబోతోంది. రాష్ట్రవ్యాప్తంగా వంద నియోజకవర్గాల్లో తొలి విడతగా ఈ పాఠశాలలను పైలట్ ప్రాజెక్ట్ కింద ప్రారంభించనున్నారు. ఈ విద్యాలయాల్లో విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో ఉచిత భోజనం, అల్పాహారం మరియు రవాణా సౌకర్యాలను కల్పించనున్నారు. ప్రైవేటు పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల కంటే ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారు మెరుగైన ఫలితాలు సాధించాలనే సంకల్పంతో రేవంత్ సర్కార్ ఈ అడుగులు వేస్తోంది.ముఖ్యంగా విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు వారి ఆరోగ్య రక్షణకు కూడా ప్రభుత్వం సమాన ప్రాధాన్యతనిస్తోంది. పాఠశాలల్లో డిజిటల్ హెల్త్ కార్డుల పంపిణీ మరియు విద్యార్థుల ఆరోగ్య సమాచారాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించే వ్యవస్థను తీసుకురానున్నారు. కేవలం పుస్తకాల్లోని పాఠాలకే పరిమితం కాకుండా, విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేలా కొత్త విద్యా విధానం ఉండబోతోంది. ఇందుకోసం రాష్ట్ర విద్యా కమిషన్ ఇప్పటికే ప్రభుత్వానికి పలు సిఫార్సులు అందజేసింది. పదవ తరగతి బోర్డు పరీక్షల రద్దుతో పాటు, ఉన్నత విద్యలో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్ వంటి పరీక్షలను కూడా రద్దు చేసి, 12వ తరగతి మార్కుల ఆధారంగానే అడ్మిషన్లు ఇచ్చే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. దీనివల్ల విద్యార్థులకు కోచింగ్ సెంటర్ల భారం తగ్గి, పాఠశాల విద్యపైనే పూర్తి శ్రద్ధ పెట్టే అవకాశం కలుగుతుంది. మొత్తానికి, రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం విద్యా రంగాన్ని కేవలం ఒక శాఖగా చూడకుండా, రాష్ట్ర అభివృద్ధికి కీలకమైన పెట్టుబడిగా భావిస్తోంది. పాఠశాలల మౌలిక సదుపాయాల కల్పన నుంచి బోధనా పద్ధతుల్లో మార్పుల వరకు ప్రతి అంశాన్ని అత్యంత లోతుగా సమీక్షిస్తున్నారు. ఈ మార్పులు అమల్లోకి వస్తే, భవిష్యత్తులో తెలంగాణ విద్యా వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచే అవకాశం ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడం, డ్రాపౌట్లను తగ్గించడం మరియు ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా సాగుతున్న ఈ ప్రయాణం రాష్ట్ర విద్యా చిత్రపటాన్ని మార్చేయబోతోంది.

## ఇక్కత్ చేనేత చీరలను పరిశీలించిన
# జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి





**యాదాద్రి భువనగిరి, మహా:** ఇక్కత్ చేనేత చీరలు, ఫ్యాబ్రిక్ ఉత్పత్తులు ప్రఖ్యాతను మార్కెట్లో ప్రత్యేకమైన బ్రాండ్‌గా ఉండాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. శుక్రవారం చౌటుప్పల్ మండపం లోని ఎల్లం బావి గ్రామంలో రూర్బన్ ప్రాజెక్ట్ కింద నెలకొల్పిన మహిళా ఇక్కత్ హస్త కళా పరస్పర సహకార సంఘం సొసైటీ ని కలెక్టర్ సందర్శించారు. కలెక్టర్ సభ్యుల తో మాట్లడుతూ వారి వారి సమస్యలు, ఉత్పత్తి విధానం, మార్కెటింగ్ పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఉన్న షెడ్ సరిపోవడం లేదని ఇంకోషెడ్ ను ఏర్పాటు చేయాలని, బోర్ మోటార్ సౌకర్యం కల్పించాలని, ఉత్పత్తుల ను అమ్ముకోవడానికి మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని కలెక్టర్ కు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చేనేత ఉత్పత్తులకు నాణ్యతను పెంచుతూ, ఆధునిక డిజైన్లు, మార్కెటింగ్ పద్ధతులను అవలంబించడం ద్వారా మన జిల్లా లో ఉత్పత్తి అవుతున్న ఇక్కత్ చీరలకు,ఫ్యాబ్రిక్ ఉత్పత్తు లకు దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు తీసుకురావచ్చని సూచించారు.చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, ఉత్పత్తులను ఆన్‌లైన్ మార్కెట్లలో కూడా విక్రయించే అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. ఇక్కత్ చీరలు ప్రత్యేకతను కాపాడుతూ, ఒక బ్రాండ్‌గా నిలిపేందుకు అన్ని విధాలుగా సహకారం అందిస్తామని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారు. పోచంపల్లి, కొయ్యలగూడెం ఇక్కత్ చీరలు, ఫ్యాబ్రిక్ ఉత్పత్తుల కు సంప్రదాయ నైపుణ్యం, ప్రత్యేక డిజైన్లు, నాణ్యతతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందినవని ఈ ప్రత్యేకతను మరింత బలోపేతం చేసి ఒక స్థిరమైన బ్రాండ్ ఇమేజ్ను సృష్టించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు సంబంధింత శాఖల సమన్వయంతో చర్యలు తీసుకుంటామన్నారు. ప్రింటింగ్ చీరలకు , చేనేత చీరలకు గల తేడాలను సాటి చెప్పాలని అన్నారు.డిజిటల్ మార్కెటింగ్ పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు ఇక్కత్ మహిళా సొసైటీ కి వారు కోరినట్లు అదనంగా మరొక షెడ్డుకు, బోర్ మోటార్ గురించి ఎస్టిమేట్స్ సిద్ధం చేసి ప్రతిపాదనలను పంపించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.మహిళా సొసైటీ కి హైదరాబాద్ లో శిల్పరామారం లో ఒక షాప్ ను కేటాయించు టకు కృషి చేస్తానని, సొసైటీ ప్రత్యేక లోగో, లేబుల్ రూపొందించు కోవాలని సూచించినారు.ఈ కార్యక్రమం లో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి, కొయ్యలగూడెం సర్పంచ్ శ్రీమతి కైరం కొండ స్వప్న , ఎల్లం బావి సర్పంచు శ్రీమతి గంజి వనజ , మహిళా ఇక్కత్ సహకార సంఘము అధ్యక్షురాలు లత, కార్యవర్గ సభ్యులు,సంబంధిత అధికారులు, Addl.DRDO సురేష్, చేనేత శాఖ డెవలప్మెంట్ ఆఫీసర్ బలరాం రెడ్డి , సందీప్ ఎంపీడీఓ , ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వేముల వీరేశం కు ప్రభుత్వ విప్
## హర్షం వ్యక్తం చేసిన
# సంగిశెట్టి క్రిస్టఫర్

**భువనగిరి, మహా:** రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నకిరేకల్ శాసనసభ్యులు ఉద్యమ నాయకుడు వేముల వీరేశం కు ప్రభుత్వ విప్ ఇవ్వడం పట్ల మలిదశ ఉద్యమకారుడు టియుజెఏసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంఘీశెట్టి క్రిస్టఫర్ హర్షం వ్యక్తం చేశారు ప్రజా ఉద్యమ నాయకుడికి ప్రభుత్వ విప్ రావడం పట్ల ఎంతో ఆనందంగా ఉందని ఆయన అభినందించారు

# వాహనదారులకు షాక్..!

- యుద్ధ భయాలతో ఇంధన ధరల పెంపు
- లీటరుకు రూ.2.35 పెరిగిన ప్రీమియం పెట్రోల్
- సాధారణ పెట్రోల్‌కు ఊరట


**హైదరాబాద్, మహా:** ప్రపంచ ఇంధన మార్కెట్‌ను పశ్చిమాసియా ఉద్రిక్తతలు తీవ్రంగా కుదిపేస్తున్నాయి. అక్కడ నెలకొన్న అస్థిర వాతావరణం, యుద్ధ భయాల ప్రభావం ఇప్పుడు నేరుగా భారతీయ ఇంధన రంగంపై పడింది. అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో దేశీయ చమురు మార్కెటింగ్ కంపెనీలు శుక్రవారం కీలక నిర్ణయం తీసుకున్నాయి. కేవలం మెరుగైన ఇంజన్ పనితీరు కోసం వినియోగించే ప్రీమియం పెట్రోల్ ధరలను అమాంతం పెంచుతున్నట్లు ప్రకటించాయి. ఈ పెరిగిన ధరలు తక్షణమే అమల్లోకి రావడంతో, మెరుగైన మైలేజ్ కోసం ప్రీమియం ఇంధనం వాడే వాహనదారులపై ఆర్థిక భారం పడనుంది. ప్రధాన చమురు సంస్థలైన భారత పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్), ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్) తమ ప్రత్యేక బ్రాండ్ల ధరలను సవరించాయి. తాజా ప్రకటన ప్రకారం, బీపీసీఎల్ విక్రయించే 'స్పీడ్', హెచ్‌పీసీఎల్ బ్రాండ్ 'పవర్', అలాగే ఐఓసీఎల్ కి చెందిన 'XP95' ప్రీమియం పెట్రోల్ ధరలు గణనీయంగా పెరిగాయి. ఆయా ప్రాంతాల రవాణా ఖర్చులు, స్థానిక పన్నులను బట్టి లీటరుకు కనిష్టంగా రూ.2.09 నుంచి గరిష్టంగా రూ.2.35 వరకు ధరలు ఎగబాకాయి. అయితే, సామాన్య ప్రజలకు కొంత ఊరటనిచ్చే అంశం ఏమిటంటే.. సాధారణ పెట్రోల్, డీజిల్ ధరలను చమురు సంస్థలు ప్రస్తుతానికి యథాతథంగానే ఉంచాయి. కేవలం అధిక ఆక్టేన్ రేటింగ్ ఉండే ప్రీమియం పెట్రోల్‌పైనే ఈ పెంపును వర్తింపజేశాయి. సాధారణంగా ఖరీదైన కార్లు, హైఎండ్ స్పోర్ట్స్ బైక్‌లు వాడేవారు ఇంజన్ దీర్ఘకాలిక మన్నిక కోసం, అధిక మైలేజ్ కోసం ఈ ఇంధనాన్ని ఎక్కువగా ఆశ్రయిస్తుంటారు. ప్రస్తుత పెంపుతో వీరికి ఇంధన ఖర్చులు తడిసి మోపెడు కానున్నాయి. ఈ ఆకస్మిక పెంపు వెనుక అంతర్జాతీయ భౌగోళిక రాజకీయాలే ప్రధాన కారణమని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రపంచ ముడి చమురు ఉత్పత్తిలో పశ్చిమాసియాది అత్యంత కీలక పాత్ర. అక్కడ ఏమాత్రం అలజడి రేగినా చమురు సరఫరా గొలుసులో అంతరాయాలు ఏర్పడతాయనే ఆందోళనలు గ్లోబల్ మార్కెట్లను భయపెడతాయి. ముడి చమురు కోసం దాదాపు 80 శాతానికి పైగా దిగుమతులపైనే ఆధారపడే భారతదేశానికి ఈ అంతర్జాతీయ ఒడిదుడుకులు ఎప్పుడూ సవాలుగానే ఉంటాయి. ఆ ఒత్తిడిని అధిగమించే క్రమంలోనే ఆయిల్ కంపెనీలు ముందుగా ప్రీమియం ఇంధన ధరలను సవరించినట్లు తెలుస్తోంది. భవిష్యత్తులో ఈ భౌగోళిక ఉద్రిక్తతలు సద్దుమణగకపోతే, సామాన్యులు వాడే సాధారణ పెట్రోల్ ధరలపై కూడా ఈ పశ్చిమాసియా సెగ పడే ప్రమాదం లేకపోలేదని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.



# ధురంధర్-2 ఫస్ట్ డే కలెక్షన్స్..

## మొదటి సినిమాగా రికార్డ్

‘ధురంధర్ 2’ ఫస్ట్ డే బాక్సాఫీస్ వద్ద కలెక్షన్స్ సునామి సృష్టించింది. స్త్రీ 2, జవాన్, యానిమల్ వంటి చిత్రాల రికార్డులను బద్దలు కొట్టి, బాలీవుడ్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది. రణ్‌వీర్ సింగ్ హీరోగా, ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ మూవీ మార్చి 18 నుంచే ప్రీమియర్ షోలతో థియేటర్స్‌లోకి వచ్చేసింది. ఫస్ట్ డే ‘ధురంధర్ 2’ కలెక్షన్స్ దుమ్మురేపింది. భారతీయ చిత్ర పరిశ్రమలో 'పుష్ప2' తర్వాత భారీ ఓపెనింగ్స్ రాబట్టిన సినిమాగా ధురంధర్2 నిలిచింది. గతేడాదిలో విడుదలైన ‘పార్ట్1’ తొలిరోజు కలెక్షన్లు రూ.28.60 కోట్ల (నెట్) రాబట్టిన విషయం తెలిసిందే. ట్రేడ్ అనలిస్ట్ వెబ్ సైట్ సక్నిల్క్ ప్రకారం ధురంధర్ 2 ఫస్ట్ డే, ప్రీమియర్స్‌తో కలిసి ప్రపంచవ్యాప్తంగా రూ. 172.63 కోట్ల గ్రాస్ రాబట్టింది. నెట్ పరంగా అయితే రూ. 145.55 కోట్లు అని ఆ సంస్థ పేర్కొంది. ఈ క్రమంలో నెట్ కలెక్షన్లలో రూ.100 కోట్లు దాటిన మొదటి హిందీ సినిమాగా ధురంధర్ 2 నిలిచింది. కేవలం హిందీ నుంచే ఈ సినిమాకు రూ.103 కోట్ల నెట్ కలెక్షన్లు రావడం విశేషం. ఇప్పుడు వరసు సెలవులు ఉండటంతో ఫస్ట్ వారంలోనే రూ. 700 కోట్ల మార్క్‌ను సులువుగా దాటుతుందని అంచనా వేస్తున్నారు. ‘ధురంధర్: ది రివెంజ్’ ప్రీమియర్స్‌తోనే హిట్ టాక్ తెచ్చుకోవడం ఆపై ఉగాది, రంజాన్ వంటి పండుగల సెలవులు ఉండటంతో ఈ మూవీకి కలిసిసొస్తుంది. ఈ మూవీలోని యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులను అలరిస్తున్నాయి. మాధవన్, సంజయ్ దత్, అర్జున్ రాంపాల్ వంటి స్టార్ యాక్టర్స్ ఈ మూవీకి మరింత బలాన్ని చేకూర్చింది. ప్రస్తుతం ‘ధురంధర్ 2’కు వస్తున్న ఆదరణ చూస్తుంటే కలెక్షన్స్ పరంగా మరిన్ని రికార్డులు సృష్టించే అవకాశాలు కనిపిస్తున్నాయి.



# నటికి చేదు అనుభవం..

## హైవేపై తాగుబోతుల వేధింపులు

బాలీవుడ్ నటి నిమిషా నాయర్‌కు చేదు అనుభవం ఎదురైంది. ముంబై బాంద్రాలో క్యాబ్‌లో వెళ్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు తనను ఇబ్బందిపెట్టారంటోంది. ఈ మేరకు ఓ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఉదయం 4.50 గంటల సమయంలో నేను క్యాబ్‌లో వెళ్తున్నాను. ఆ సమయంలో డ్రైవర్ ఓ బైక్‌ను ఓవర్‌టేక్ చేశాడు. ఆ బైక్‌పై ఉన్నవారు బాగా తాగినట్లున్నారు. వాళ్లను దాటేసినందుకు కోపంతో ఊగిపోయారు.

### కొట్టడానికి రెడీ..

క్యాబ్ డ్రైవర్‌కు గుణపాఠం చెప్పాలనుకున్నారు. హైవే మధ్యలో మా కారును అడ్డుకున్నారు. కారు ఎదుటే బైక్ నిలిపి ముందుకు వెళ్లనీయకుండా చేశారు. ఆవేశంతో ఎగబడ్డారు, దుర్భాషలాడారు. డోర్స్ తెరిచేందుకు ప్రయత్నించారు. నన్ను విండోస్ కిందకు దించమన్నారు. వాళ్లెంత రెచ్చగొట్టినా సరే మేము ఆ పని చేయలేదు. ఎందుకంటే అతడు డ్రైవర్‌ను కొట్టడానికే మా కారు ఆపాడని నాకు బాగా తెలుసు.. మా రక్షణ కోసం మేము సైలెంట్‌గా ఉండిపోయాం.


### వీడియో తీస్తున్నానని..

మమ్మల్ని చాలాసేపు వేధించారు. నేను వీడియో తీస్తున్నానని గ్రహించి కారు ఫోటోలు తీసుకుని వెళ్లిపోయారు అని పేర్కొంది. వీరిపై చర్యలు తీసుకోమని పోలీసులను కోరింది. ఇది చూసిన నెటిజన్లు.. మీరు క్షేమంగా ఉన్నందుకు సంతోషం, ఇలాంటి పరిస్థితి ఎదుర్కోవడం దురదృష్టకరం.. అని కామెంట్లు చేస్తున్నారు. కాగా నిమిషా నాయర్.. అమర్ కాలనీ, 8 ఏఎమ్ మెట్రో సినిమాల్లో నటించింది. 'ట్రయల్ బై ఫైర్' వెబ్ సిరీస్‌లోనూ యాక్ట్ చేసింది.




# ఈ హీరోయిన్ ఎవరో గుర్తుపట్టారా..?

పైన కనిపిస్తున్న టాలీవుడ్ హీరోయిన్ ఎవరో గుర్తుపట్టారా.. ? తాజాగా ఈ అమ్మడు ఇన్ స్టాలో షేర్ చేసిన ఫోటోస్ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఇంతకీ ఆమె ఎవరంటే.. ఒకప్పుడు ఇండస్ట్రీలో అందరి దృష్టిని ఆకర్షించిన హీరోయిన్ నైరా బెనర్జీ. ఇంతకీ ఇప్పుడు ఆ ముద్దుగుమ్మ మీకు గుర్తొచ్చిందా.. ?దాదాపు రెండు దశాబ్దాల క్రితం ఆ ఒక్కడు సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయ్యింది. ఆ సినిమా ఆశించిన స్థాయిలో ఆడకపోయిన మెప్పించింది.మొదటి సినిమాతోనే అందం, అభినయంతో ఫాలోయింగ్ సంపాదించుకుంది. ఆ తర్వాత పలు సినిమాల్లో కథానాయికగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా కనిపించింది.ఆ తర్వాత చాలా కాలంగా సినిమాలకు దూరంగా ఉండిపోయింది. దాదాపు 5 ఏళ్ల గ్యాప్ తర్వాత ఈ ఏడాది ఒక హిందీ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమా నిరాశ పరిచినప్పటికీ ఈ బ్యూటీ కొత్త సినిమా ఆఫర్స్ కోసం ఎదురుచూస్తుంది. ఇప్పటికే ఆమె ముందుకు రెండు సినిమా అవకాశాలు వెళ్లాయని టాక్.మరోవైపు సోషల్ మీడియాలో గ్లామర్ ఫోజులతో మెంటలెక్కిస్తుంది ఈ వయ్యారి. ఈ మధ్య వరుసగా ఫోటోషూట్స్ నెట్టింట షేర్ చేస్తూ కుర్రాళ్లను కట్టిపడేస్తుంది. తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఈ ఫోటోలు వైరలవుతున్నాయి. ఇందులో ఆమె చాలా కూల్ గా, అందంగా కనిపిస్తున్నారంటూ కామెంట్స్ చేస్తున్నారు నెటిజన్స్.



# బుల్లితెరపై గ్లామర్ అరాచకం..

జబర్దస్త్ వర్ష.. బుల్లితెర ప్రేక్షకులకు ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేని పేరు. జబర్దస్త్ కామెడీ షో ద్వారా రెండు తెలుగు రాష్ట్రాల్లో మంచి పేరు సంపాదించుకుంది ఈ భామ. అలాగే బుల్లితెరపై సీరియల్స్ సైతం చేసింది. అయితే తనకు సినిమాల్లో హీరోయిన్స్ ఛాన్స్ వచ్చినా రిజెక్ట్ చేశానంటూ గతంలో ఓ ఇంటర్వ్యూలో చెప్పకొచ్చింది ఈ ముద్దుగుమ్మ. జబర్దస్త్ డేట్స్, టీవీ షెడ్యూల్స్ ముందే ఖరారు కావడం వల్ల సినిమా డేట్స్ సర్దుబాటు చేయలేక ఎన్నో ఆఫర్స్ వదులుకున్నట్లు అసలు విషయాలు చెప్పకొచ్చింది. ప్రస్తుతం తనకు టీవీలో వస్తున్న గుర్తింపు, సంతోషం డిస్టర్బ్ చేసుకోవడం ఇష్టం లేదని తెలిపింది. కొన్ని రోజుల తర్వాత సినిమాల గురించి ఆలోచిస్తానని అన్నారు.సంక్రాంతి ఈవెంట్ సమయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండలో పనిచేయడం వల్ల అస్వస్థకు గురయ్యానని.. వెంటనే చికిత్స తీసుకున్నట్లు తెలిపింది. సినిమాల్లో తనకు మెయిన్ లీడ్స్, హీరోయిన్ పాత్రలు చేయడం ఇష్టం లేదని.. ఇంట్లో ఫ్యామిలీలో ఉండే వదిన, అక్క, చెల్లి పాత్రలు ఎక్కువ ఆసక్తి అని అన్నారు. తనకు అలాంటి క్యారెక్టర్లే సంతోషాన్నిస్తాయని అన్నారు. ఎన్టీఆర్ చెల్లిగా, రామ్ చరణ్ సినిమాలో కీలకపాత్రలో, అల్లు అర్జున్ గర్ల్ ఫ్రెండ్ గా నటించాలని ఉందని తెలిపింది.ప్రస్తుతం సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటుంది వర్ష. తాజాగా నీలిరంగు చీరకట్టులో మతిపోగొట్టే ఫోజులతో నెట్టింట మెస్మరైజ్ చేస్తుంది ఈ వయ్యారి.



# తెలుగు హీరోలపై ఎందుకంత కోపం?

## హీరోయిన్ రియాక్షన్ ఇదే..

తమిళ టాప్ మ్యూజిక్ డైరెక్టర్ జీవీ ప్రకాశ్ కుమార్ హీరోగా నటించిన చిత్రం హ్యాపీ రాజ్. శ్రీగౌరీ ప్రియ హీరోయిన్‌గా నటించింది. ఒకప్పటి హీరో అబ్బాస్ దాదాపు పదేళ్ల తర్వాత వెండితెరపై రీఎంట్రీ ఇస్తున్నాడు. లవ్‌టుడే సినిమాకు ప్రదీప్ రంగనాథన్ వద్ద సహాయ దర్శకుడిగా పని చేసిన మరియ రాజ్ (మరియ ఇళంజెళియన్) దర్శకత్వం వహించాడు. ఈ సినిమా తమిళంతోపాటు తెలుగులోనూ విడుదల కానుంది. మార్చి 27న ప్రేక్షకుల ముందుకు రానుంది.

**తెలుగు హీరోలపై కోపం?**

ఈ క్రమంలో శుక్రవారం నాడు హ్యాపీరాజ్ తెలుగు ట్రైలర్ రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ శ్రీ గౌరీప్రియకు వింత ప్రశ్న ఎదురైంది. మీరు సినిమాల్లో తమిళ హీరోలతో రొమాంటిక్‌గా ప్రవర్తిస్తారు.. అదే తెలుగు హీరోలతో యారొగెంట్‌గా ప్రవర్తిస్తున్నారు, అంటే వాళ్లను కొడతారు. తెలుగు హీరోలపై ఎందుకంత కోపం? అని ఓ విలేకరి ప్రశ్నించాడు.

**నేనేమైనా కంకణ కట్టుకున్నానా?**

ఆ ప్రశ్న విని గౌరీప్రియ అవాక్కయింది. నేను ఒక్క సినిమాలోనే హీరోను కొట్టాను.. నేనేమైనా హీరోలను కొట్టాలని కంకణం కట్టుకున్నానా? అసలు నాకు ఎవరి మీదా కోపం లేదు. ఆ లెక్కన చూస్తే.. నేను అన్ని సినిమాల్లో ఏడుస్తానని అంటారు. తమిళ సినిమాల్లో ఏడుస్తుంది, తెలుగు మూవీస్‌లో మాత్రం సంతోషంగా నవ్వుతుందంటారు. అవేవీ నిజం కాదు.. సినిమాలో నా పాత్ర అలా డిజైన్ చేస్తున్నారు అని బదులిచ్చింది.

**సినిమా**

తెలుగమ్మాయి అయిన శ్రీ గౌరీ ప్రియ.. లవర్, మ్యాడ్, మెయిల్ వంటి సినిమాల్లో నటించింది. మ్యాడ్ మూవీలో ఈమె.. హీరో రామ్ నితిన్ చెంప చెళ్లుమనిపిస్తుంది. ఆ క్లిప్పింగ్ సోషల్ మీడియాలో తెగ వైరలయింది. ప్రస్తుతం ఆమె చేతిలో వింటారా సరదాగా, చెన్నై లవ్‌స్టోరీ చిత్రాలున్నాయి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com